కల్లుగీత కార్మిక ఉప కులాలకు
14 మద్యం షాపులు

» త్వరలో భర్తీకి దరఖాస్తులు

ఏలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నూతన మద్యం విధానంలో కల్లుగీత కార్మికుల్లోని ఉప కులాలకు 365 మద్యం షాపులు కేటాయించడంతో ఏలూరు జిల్లాలో మరో 14 షాపులు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 141 మద్యం షాపులుండగా, అదనంగా కేటాయించిన 10 శాతం షాపులను కలుపుకుంటే ఈ సంఖ్య 155కు చేరుకోనుంది. జిల్లాలో మొత్తం 10 శాతం కోటా కింద కల్లుగీత కార్మికుల్లోని ఉపకులాలకు 14 షాపులు కేటాయించారు. ఇందులో ఉప కులాల వారీగా 2 గౌడ్, 4 గౌడ, 8 శెట్టి బలిజలకు కేటాయించారు. జిల్లాలో ఈ మూడు ఉప కులాల వారీగా ఏలూరు, కైకలూరు, నూజివీడు డివిజన్‌ల్లో షాపులను ఆయా వర్గాలకు అర్హులైన వారికి ఇవ్వనున్నారు. కాగా ఈ నూతన షాపుల భర్తీకి మార్గదర్శకాలు వెలువడ్డాయి. జిల్లాలో నియోజకవర్గాల యూనిట్ ఆధారంగా గౌడ్, గౌడ, శెట్టిబలిజల్లో ఈ వర్గాల జనాభా రేషియాతో చూసి ఎక్కడ ఉంటే ఆ వర్గానికి షాపులను కేటాయిస్తారు. తాజా ఉత్తర్వులు ఆధారంగా జిల్లా ఎక్సైజ్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి కమిషనర్‌కు పంపుతారు. అనంతరం ఉపకులాల వారీగా షాపుల యూనిట్‌లుగా కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా తీస్తారు. తర్వాత అప్లికేషన్ స్వీకరణ ప్రారంభిస్తారు. దరఖాస్తుదారుడి తన కులం, నేటివిటీ సర్టిఫికెట్ల కాంపిటేట్ అథారిటీకి సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు రూ.2 లక్షల ఫీజును నిర్ణయించారు. దరఖాస్తులు సమర్పించిన దాంట్లో అర్హత కలిగినవి పరిశీలించి వారికి కేటాయిస్తారు.

సభ్యత్వంలో.. సైకిల్ జోష్!




ఐదేళ్లపాటు అధికారంలో లేకపోయినా పార్టీకి అండగా నిలవడమేకాకుండా క్షేత్రస్థాయి నుంచి ఎక్కడా పట్టు కోల్పోకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలు వీర సైనికుల్లా వ్యవహరించారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మునుపెన్నడూ లేని విధంగా పట్టణం నుంచి క్షేత్రస్థాయి వరకు పార్టీలో సభ్యత్వ నమోదులోను సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మైలు రాయి దాటిన సందర్భం లో ఏలూరు జిల్లాలో వివిధ నియోజక వర్గాల్లో రికార్డులను అధిగమించింది.

» ఊరూవాడా పెరిగిన ఆదరణ
» ఈసారి కొత్త ముఖాలే టాప్
» ఎమ్మెల్యేలు లేని నియోజక వర్గాల్లోను అదే స్పీడు..కేడరు ఉబ్బితబ్బిబ్బు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వివిధ నియోజకవర్గాల్లో అత్యధిక మెజార్టీలతో ఎమ్మెల్యేలను గెలిపించినట్టే ఆ సత్తాను తిరిగి పార్టీ సభ్యత్వ నమోదులో మరోసారి నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు రుజువు చేశాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పార్టీ సభ్యత్వం తీసుకున్న కొత్త ముఖాల సంఖ్య భారీగానే ఉంది. జిల్లాలో గతంలో కంటే ఈసారి రికార్డు స్థాయిలో పార్టీ సభ్యత్వం రెట్టింపు అయ్యింది. నియోజకవర్గాల వారీగా సభ్యత్వ నమోదులో స్థానిక నాయకత్వం పోటీలు పడింది. జిల్లాలో తమ నియోజకవర్గమే తొలి స్థానంలో నిలవాలనే లక్ష్యంతో గ్రామగ్రామాన నమోదు ప్రక్రియ వేగంగా సాఫీగా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిందన్న జోష్ ఒకవైపు ఉంటే, మరోవైపు ఏ మాత్రం జంకు లేకుండా స్వేచ్ఛగా పార్టీ సభ్యత్వం తీసుకునేవారి సంఖ్య ఈసారి భారీగా పెరగడంతో టీడీపీ నేతల సంతోషం అవధులు దాటింది. ప్రతి నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్యలో 25 శాతం మేర పార్టీ సభ్యత్వ నమోదు జరగాలని ముందుగా నిర్దేశించి దీనికి కట్టుబడే సభ్యత్వ నమోదును చేపట్టి రికార్డులను అధిగమించగలిగారు. ఉంగుటూరు నియోజకవర్గం జిల్లాలో సభ్యత్వ నమోదులో తొలి వరుసను ఆక్రమించింది. నియోజకవర్గ ఓటర్ల సంఖ్యలో 25 శాతం మేర సభ్యత్వ నమోదు జరగాలన్న నిబంధనలో భాగంగా ఉంగుటూరు తొలిస్థానం ఆక్రమించగా, సంఖ్యాపరంగా నూజివీడు ముందు వరుసలో నిలిచింది. ఉంగుటూరు నియోజకవర్గంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు నేతృత్వం వహిస్తున్న ఉంగుటూరులో మొత్తం ఓటర్ల సంఖ్య 2 లక్షల 5 వేల 314 కాగా, వీరిలో 25 శాతం మేర సభ్యత్వ నమోదు చేయగా ఈ సంఖ్య 59 వేల 148గా నమోదైంది. మిగతా నియోజకవర్గాల్లోను ప్రతి నలుగురు ఓటర్లలో ఒకరిని పార్టీ సభ్యుడిగా నమోదు చేసుకోవాలన్న లక్ష్యంలో మంత్రి పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడులో 2 లక్షల 48 వేల 027 మంది ఓటర్లు ఉండగా వీరిలో 61 వేల 159 మందిని పార్టీ సభ్యులుగా చేర్చుకోగలిగారు. టీడీపీ ఎమ్మెల్యేలు ఉంగుటూరు, కైకలూరు, పోలవరం నియోజకవర్గాల్లో లేనప్పటికి ఆయా నియోజక వర్గాల్లోను సభ్యత్వ నమోదులో పోటీలు పడ్డారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న దెందులూరు నియోజకవర్గంలో 2 లక్షల 21 వేల 924 మంది ఓటర్లు ఉండగా, వీరిలో 53 వేల 607 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి ప్రాతినిధ్యం వహిస్తున్న ఏలూరు నియోజకవర్గంలో 2 లక్షల 31 వేల 572 మంది ఓటర్లు ఉంటే ఇక్కడ 52 వేల 844 మంది టీడీపీ సభ్యత్వం స్వీకరించారు.

కొత్త ముఖాలు సైకిల్ ఎక్కారు

మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వివిధ వర్గాలు సైతం టీడీపీ సభ్యత్వం తీసుకోవడానికి మొగ్గు చూపారు. ఈ పరిస్థితిని స్థానిక నాయకత్వం చేజార్చకుండా జాగ్రత్తపడింది. పార్టీ సభ్యత్వం తీసుకోవడానికి కొత్తగా ముందుకొచ్చిన వారిలో అత్యధికులు చింతలపూడి నియోజకవర్గానికి చెందిన వారు కావడం విశేషం. ఈ నియోజకవర్గంలో కొత్త ముఖాలు 32 వేల 870 మంది పార్టీ సభ్యత్వం స్వీకరించారు. నూజివీడులో 30 వేల 996, ఉంగుటూరులో 31 వేల 684, దెందులూరులో 22 వేల 811, కైకలూరులో 27 వేల 016, ఏలూరులో 32 వేల 562, పోలవరంలో 23 వేల 812 మంది కొత్తగా పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. పార్టీలో ఈసారి రూ.లక్ష చెల్లిస్తే శాశ్వత సభ్యత్వ నమోదుకు అవకాశం ఇచ్చారు. కైకలూరులో 11 మంది, ఉంగుటూరులో ఆరుగురు, చింతలపూడిలో ఆరుగురు శాశ్వత సభ్యత్వం పొందారు.

అంతటా ఉత్సాహం

సభ్యత్వ నమోదులో స్పందన చూసి ఆ పార్టీ నేతలు ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఇంతకుముందెన్నడూ లేని విధంగా అత్యధికులు పార్టీ సభ్యత్వం తీసు కోవడం, అదీ వివిధ వర్గాల నుంచి స్వచ్ఛందంగా వారం తట వారుగానే వచ్చి సభ్యత్వం తీసుకోవడం హర్షణీయ పరిణామంగా భావిస్తున్నారు. సభ్యత్వం తీసుకుంటే ప్రమా ద బీమా వర్తించడం, పార్టీలో కుటుంబ సభ్యుల మాది రిగా మెలిగే అవకాశం ఉండడంతో అత్యధికులు ముందు కొచ్చారని కొత్తగా చేరిన వారి సంఖ్య చూస్తే బోధపడుతుంది. ఇంకో ఆసక్తికర విషయమేమిటంటే సభ్యత్వం తీసుకోవడంలో మహిళలు పెద్ద సంఖ్యలో ముందుకు రావడమే.

స్వచ్ఛందంగా కదలివచ్చారు ..



పార్టీ పట్ల అభిమానం అంతకంతకు రెట్టింపవుతుంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వివిధ వర్గాలు తాము పార్టీ సభ్యత్వం తీసుకుంటామంటూ స్వచ్ఛందంగా కదలివచ్చారు. అన్ని వర్గాలు ఎన్నికల్లో కూటమికి ఎలా మద్దతు అయితే ఇచ్చాయో అదే ఉత్సాహంతో సభ్యత్వ నమోదులోను స్పందిస్తూ వచ్చారు. పార్టీకి తిరుగులేని బలం ఇవ్వడమే కాకుండా క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం అయ్యింది.

- గన్ని వీరాంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా
విక్రమ్ కిశోర్



విక్రమ్ కిశోర్‌ను సత్కరిస్తున్న బీజేపీ సీనియర్ నాయకులు తపన చౌదరి, అంబికా కృష్ణ తదితరులు

ఏలూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా చౌటపల్లి విక్రమ్ కిశోర్ రెండోసారి ఎన్నికయ్యారు. ఏలూరులోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ సమావేశం జరిగింది. అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి సోమవారం నామినేషన్ ప్రక్రియ జరగ్గా పలువురు సీనియర్ నాయకులు పోటీ పడ్డారు. అయితే అధిష్టానం విక్రమ్‌కిశోర్‌ను మరోసారి జిల్లా అధ్యక్షుడిగా సూచించడంతో ఆయన పేరును ఎన్నికల పరిశీలకులు రేలంగి శ్రీదేవి కార్యకర్తల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు తపన చౌదరి, అంబికా కృష్ణ తదితరులు విక్రమ్ కిశోర్‌కు శాలువా కప్పి అభినందించారు. అంబికా కృష్ణ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో కార్యకర్తల మనోభావాలను అధిష్టానం గుర్తించాలని పేర్కొన్నారు. కూటమిలో బీజేపీ భాగస్వామ్యం అయినా ప్రభు త్వం నిర్వహించే కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా నాయకులకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని, ఇదే విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వాపోయారు. సోమవారం కేంద్ర హోంశాఖ మంత్రి విజయవాడ వచ్చిన సందర్భంలో సైతం బీజేపీ నాయకులను గుర్తించకపోవడం దారుణమన్నారు. కార్యకర్తలకు జరిగే నష్టాన్ని అధిష్టానం దృష్టికి తప్పనిసరిగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. విక్రమ్ కిశోర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో 1996లో బీజేపీలో కార్యకర్తగా చేరి, క్రమశిక్షణ గల కార్యకర్తగా పలు పదవులు చేపట్టానన్నారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు రామ కృష్ణారెడ్డి, అశోక్ చక్రవర్తి, కె.కృష్ణప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి, మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మలా కిశోర్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



'పశ్చిమ' అధ్యక్షురాలిగా శ్రీదేవి

భీమవరం టౌన్, జనవరి 21(ఆంధ్ర జ్యోతి): భారతీయ జనతాపార్టీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షురాలుగా తణుకు కు చెందిన అయినంపూడి శ్రీదేవి నియమితులయ్యారు. భీమవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన కార్య క్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ బీజే పీ సిద్ధాంతాల ప్రకారం జిల్లా అధ్యక్ష పదవిని ఈసారి మహిళలకు కేటా యించారని దీంతో జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకుని శ్రీదేవిని ఎంపిక చేశామన్నారు.

కైకలూరు సర్పంచ్ చెక్‌పవర్ రద్దు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వార్డు సభ్యులు

కైకలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : కైకలూరు గ్రామపంచాయతీ సర్పంచ్ డీఎం నవరత్నకుమారి చెక్‌పవర్‌ను నిలిపివేస్తూ జిల్లా పంచాయతీ అధికారి పి.అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై మంగళవారం ఫోన్‌లో ఆమెను వివరణ కోరగా చెక్‌పవర్‌ను రద్దు చేసిన మాట వాస్తవమేనని, సర్పంచ్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేయగా రూ.కోటి 84 లక్షల నిధులు అవకతవకలు పాల్పడినట్టుగా తేలడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు చెక్‌పవర్‌ను నిలిపివేసినట్టు స్పష్టం చేశారు.

చెక్ పవర్‌ను నిలిపివేయడం హర్షణీయం : వార్డు సభ్యులు

కైకలూరు మేజర్ పంచాయతీలో ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉండగా సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలతో పంచాయతీ పారిశుధ్య కార్మికులకు చెల్లించాల్సిన సొమ్ములను పక్కదారి పట్టించారని, దీనిపైన ఉన్నతాధికారు లకు వార్డు సభ్యులు కేవీఎస్ఎం నాయుడు, మేడూరి నాంచారయ్య ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కైకలూరులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వార్డు సభ్యులు మాట్లాడుతూ పంచాయతీలో అవకతవకలు జరిగినట్టు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామన్నా రు. ఇద్దరు డీఎల్పీవోలు విచారణ చేసి రూ.కోటి 84 లక్షలు అవకతవకలు జరిగాయని, వీటిలో రూ.90 లక్షలకు ఎటువంటి ఆధారాలు చూపలేదని తేల్చారన్నారు. ఏడాదిగా ఫిర్యాదులు చేస్తూనే ఉన్నామని 2022-23 ఆర్థిక సంవత్సరంలోనే ఇంత పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందంటే ఇప్పటివరకు ఎన్ని కోట్లు పక్కదారి పట్టాయోనన్న సందేహం కలుగుతోందన్నారు. సీఐడీ ఎంక్వైరీ చేసి పూర్తిస్థాయిలో అవినీతిని బయటకు తీయాలని కోరారు. అవినీతిని ప్రశ్నించినందుకే వార్డు సభ్యులపై తిరగబడడమే గాక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మంచిగంటి వాసు, సుధారాణి, బెల్లాని శ్యామలరావు, రమ్య, సమతం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోగా లక్ష ఇళ్లు పూర్తి చేస్తాం..

» అర్హత కలిగిన పేదవాడికి సొంతిల్లు
» రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



పోణంగిలో మహిళతో మాట్లాడుతున్న మంత్రి కొలుసు.. చిత్రంలో ఎమ్మెల్యే చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : రానున్న ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలోని అర్హత కలిగిన ప్రతీ పేదవానికి సొంతిల్లు అందించాలన్న ఆశయంతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని, మార్చిలోగా లక్ష ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. అనంతరం లబ్ధిదారులకు తాళాలు అందించి గృహ ప్రవేశాలను చేయిస్తామని భరోసా ఇచ్చారు. ఏలూరు మండలం పోణంగిలో ఎన్టీఆర్ ఇళ్ల లేవుట్‌ను ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), కలెక్టర్ వెట్రిసెల్వితో కలిసి మంత్రి మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ఇళ్లకు విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ సౌకర్యాలు కల్పించాలని మంత్రిని కోరారు. లే అవుట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పోణంగి లేఅవుట్‌లో 7,035 ఇళ్లకు గాను 5,667 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మంజూరు చేయగా ఇందులో 875 ప్రారంభించారన్నారు. మౌలిక సదుపాయాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఇక్కడ పనులకు ఇసుక కొరత లేకుండా వారం రోజుల్లో స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఇళ్ల లేఅవుట్‌ల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మంత్రి కొమడవోలు ఎన్టీఆర్ ఇళ్ల లేఅవుట్‌ను పరిశీలించారు. కొమడవోలు లే అవుట్‌లో మార్చి నాటికి 1500 ఇళ్లు పూర్తి చేయాలన్నారు.

ఆ దమనకాండకు ఏడాది!

అంగన్‌వాడీలపై వైసీపీ ప్రభుత్వం ఉక్కుపాదం



ఏలూరులో బస్సులో అంగన్‌వాడీల నినాదాలు (ఫైల్)



కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌లో నిర్బంధంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు (ఫైల్)

నూజివీడు/ ఏలూరు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ వర్కర్లు తమ పరిష్కారం కోసం ఉద్యమించి నేటికీ ఏడాది అయింది. వైసీపీ పాలనలో అంగన్‌వాడీ కార్యకర్తలపై ప్రభుత్వం అరాచకంగా ప్రవర్తించింది. జిల్లాలో 1600 మంది అంగన్‌వాడీ వర్కర్లు ఉండగా మినీ వర్కర్లు 200 మంది, హెల్పర్లు 1600 మంది మొత్తం 3,400 మంది పని చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కారం కోసం గత ఏడాది జనవరిలో విజయవాడ రాష్ట్రస్థాయిలో నిరాహార దీక్షలు చేపట్టారు. వారికి మద్దతుగా 22వ తేదీన భారీ ఎత్తున నిరసన కార్యక్రమం విజయవాడలో తలపెట్టారు. ఆ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు వెళ్లడానికి ప్రయత్నాలు చేయగా అప్పటి ప్రభుత్వం వైసీపీ ఎక్కడికక్కడే వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్లలో నిర్బంధించారు. విజయవాడలో దీక్ష చేస్తున్న వారిని చెల్లాచెదురు చేసి తమ అరాచకాన్ని వైసీపీ ప్రభుత్వం ప్రదర్శించింది. ఆనాడు ప్రతిపక్ష పార్టీలుగా ఉన్న తెలుగుదేశం, జనసేన, ఇటు వామపక్షపార్టీల నాయకులు కొంత అండగా నిలిచి, మనోధైర్యాన్ని ఇవ్వడంతో అంగన్ వాడీలు ఇళ్లకు చేరారు. ఆ రోజు కనీసం తాగునీరు ఇవ్వ కుండా మందు బిళ్ళలు తీసుకోనివ్వకుండా మానవత్వాన్ని మరిచి పోలీసులు వ్యవహరించిన తీరు సర్వత్రా విమర్శలకు దారితీసింది. నూజివీడులో సారథి ఇంజినీరింగ్ కళాశాలలో అంగన్ వాడీలను నిర్బంధంలో ఉంచగా, దాదాపు 15 బస్సులకు పైగా శ్రీకాకుళం, విజయనగరం, ఇటు నెల్లూరు తదితర దూరప్రాంతాల నుంచి అంగన్‌వాడీలను తీసుకువచ్చి మధ్యాహ్నం 3 గంటల వరకు కళాశాలలోనే ఉంచారు. అనంతరం అక్కడి నుంచి విజయవాడ, ఏలూరు రైల్వేస్టేషన్‌లలో అంగన్ వాడీలను విడిచిపెట్టగా గమ్యస్థానాలకు చేరడానికి అవస్థలు పడ్డారు. తమ సమస్యలు పరిష్కారం కోసం చేసిన ఆందోళన ఏడాది పూర్తయినా ఇంతవరకూ ఏ సమస్య పరిష్కారం కాలేదని, కూటమి ప్రభుత్వమైనా నెరవేర్చాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.భారతి, అంగన్‌వాడీ వర్కర్లు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలి



అంగన్‌వాడీ డిమాండ్‌లను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందనే ఆశాభావంతో అంగన్‌వాడీలు ఉన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వర్కర్లకు లక్షా 20 వేలు, హెల్ప ర్లకు రూ.60 వేలు, చెల్లించడంతో పాటు హెల్పర్లకు ప్రమోషన్లు ఇచ్చే వయస్సును పెంచాలి. మినీటీచర్లను మెయిన్ టీచర్లు గా పదోన్నతి కల్పించాలి. అంగన్‌వాడీల వేతనాలను పెంచాలని కోరుతున్నాం.

-ఎస్.విజయ్‌దుర్గ, ఆగిరిపల్లి, సీపీఐ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు

వీల్‌చైర్ క్రికెట్ రాష్ట్ర కెప్టెన్‌గా రాజశేఖర్



పాలకొల్లు టౌన్, జనవరి 21 (ఆంధ్ర జ్యోతి): పాలకొల్లు పట్టణం లోని రామారావుపేటకు చెందిన ఎంఎన్ రాజశేఖర్ రాష్ట్ర వీల్ చైర్ క్రికెట్ టీమ్ కెప్టెన్‌గా ఎంపిక చేసినట్టు రాష్ట్రవీల్ చైర్ క్రికెట్ అసోసియేషన్ ప్రకటించిందని రాజశేఖర్ మంగళ వారం తెలిపారు. ఫిబ్రవరిలో మధ్యప్రదేశ్‌లోని గాల్వియర్‌లో జరిగే 4వ జాతీయస్థాయి వీల్‌చైర్ క్రికెట్ పోటీల జట్టుకు రాజశేఖర్ కెప్టెన్‌గా వ్యవహ రిస్తారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం ఉంటే వైకల్యాన్ని జయించ వచ్చునని తెలిపారు. ఐదేళ్ళుగా వీల్ చైర్ క్రికెట్ టీంకు రాష్ట్రం తరపున కెప్టెన్‌గా వ్యవహ రించి, పలు టోర్నమెంట్లలో రాణించి గుర్తింపు తెచ్చుకున్నాడు. రాజశేఖర్‌ను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

గిరిజన ప్రతిభకు పురస్కారం.. గణతంత్ర వేడుకలకు ఆహ్వానం

పోలవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో పాపికొండల అభయారణ్యంలో మారుమూల గ్రామాల్లో ఉంటున్న గిరిజనులకు ఢిల్లీలో జరగనున్న గణ తంత్ర వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఎంపికైన నలుగురు గిరిజనులు ఢిల్లీ బయల్దేరి వెళ్ళారు. గిరిజనాభివృద్ధి కోసం గతేడాది ప్రధాన మంత్రి మన్‌ధన్ వికాస్ కేంద్రాలు ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా మండ లంలో కొంతమంది గిరిజనులను ఎంపిక చేసి వారికి ఐటీడీఏ ద్వారా విస్తరాకుల తయారీ, యంత్రాల ద్వారా వేరుశెనగ గుళ్ల వేరు చేయడం, జీడిగింజల నుంచి జీడిపప్పు వేరు చేయడం లాంటి పనుల్లో శిక్షణ ఇచ్చి యూనిట్లు మంజూరు చేశారు. దీంతో ఆ యూనిట్ల ద్వారా గిరిజనులకు స్వయం ఉపాధి చేకూరి ఆర్థికాభివృద్ధి జరిగింది. దీంతో ఆయా యూనిట్ల నిర్వహణలో క్రియాశీలకంగా పని చేసిన ముగ్గురు మహిళలు, ఒక యువకుడిని ఢిల్లీ గణతంత్ర వేడుకలలో పాల్గొనడానికి ఆహ్వానం అందింది. వింజరం డ్వాక్రా స్వయం సహాయక సంఘాల సీఏ మడకం కృష్ణవేణి, గెడ్డపల్లి గ్రామానికి చెందిన సోడెం మంగమ్మ, గార్లగొయ్యి గ్రామానికి చెందిన పొట్టోడి శ్రీవిద్య, కొరుటూరు గ్రామానికి చెందిన కుర్ల పోసిరెడ్డి ఎంపికైన వారిలో ఉన్నారు.

పునరావాస జాబితాలో గల్లంతైన ఇళ్లకు సర్వే

కుక్కునూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): పోలవరం పునరావాస ప్రక్రియలో భాగంగా ప్రతీ నిర్వాసితునికి వ్యక్తిగత పునరావాస పరిహారం కొల్పోతున్న ఇళ్ళకు పరిహారం అందించాలి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుక్కునూరు ఏ.బ్లాక్‌కు చెందిన దాదాపు 100 మందికి పైగా నిర్వాసితుల ఇళ్ళ పరిహారం జాబితాలు గల్లంతయ్యాయి. న్యాయం చేయ్యండని ఎన్నిసార్లు మొరపెట్టుకున్న వైసీపీ ప్రజా ప్రతినిధులు, అప్పటి అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్వాసితులపై దృష్టి సారించింది. ఈ క్రమంలో రూ.995 కోట్ల పరిహారాన్ని నిర్వాసితుల ఖాతాల్లో జమ చేసింది. కుక్కునూరు ఏ.బ్లాక్‌కు చెందిన వందమంది నిర్వాసితుల పేర్లు ఇళ్ళ జాబితాలో గల్లంతవడంతో వారికి పరిహారం అందలేదు. ఈ క్రమంలో కుక్కునూరు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, ఇటీవల భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కలిసి సమస్య వివరించారు. దీనికి స్పందించి జాబితాలో గల్లంతైన ఇళ్ళ జాబితాను సర్వే చేయాలని ఆదేశించారు. దీంతో మంగళ వారం ఆర్‌అండ్‌బీ డీఈ విజయ్‌శ్రీకార్, ఏఈ రాజు ఆధ్వర్యంలో కుక్కునూరు ఏ.బ్లాక్‌లో సర్వే చేపట్టారు. ఇంటి విలువ కొలతల ప్రకారం అంచనా రూపొందించి అధికారులకు నివేదిక ఇవ్వనున్నారు. 41.15 కాంటూరు లేవిల్‌లో ఉన్న కివ్వాక నిర్వాసిత గ్రామాల్లో కూడా దాదాపు 100కు పైగా నిర్వాసితుల ఇళ్ళ పేర్లు జాబితాలో గల్లంతయ్యాయి. సర్వే జరిపి న్యాయం చేయాలని అక్కడ నిర్వాసితులు కోరుతున్నారు.



కుక్కునూరులో ఇళ్ల కొలతలు వేస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న కోమలి దేవి కూచిపూడి నృత్య ప్రదర్శన



భీమవరం టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ 61వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కొటికలపూడి గోవిందరావు కళావేదికపై విశాఖపట్నంకు చెందిన వేమిరెడ్డి కోమలి దేవి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. మధ్యాహ్నం 12 గంటలకు శృంగవృక్షంకు చెందిన పద్మాలమ్మ మురళీకోటాలం బృందం కోలాటం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు మచిలీపట్నంకు చెందిన పాండురంగ ఆర్కెస్ట్రా వారిచే సినీ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. రాత్రి 8-30కు విజయవాడకు చెందిన రఫయిల్ సత్య హరిశ్చంద్ర కాటి సీను ఏకపాత్ర చేశారు. రాత్రి 9 గంటలకు శ్రీరామాంజనేయ యుద్ధం నాటకం ప్రదర్శించారు.

ఇంకెంతకాలం ఇలా..?





ఎర్రకాలువపై నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్డు లేకుండా నిలిచిపోయిన నిర్మాణం

ఎర్రకాలువపై వంతెనకు రెండు దశాబ్దాలు

మధ్యలోనే వదిలేసిన వైనం

రూ. కోట్ల ప్రజాధనం వృథా

తణుకు రూరల్, జనవరి 21, (ఆంధ్రజ్యోతి) తణుకు, తాడేపల్లి గూడెం మండలాల శివారు గ్రామాల్లో ఎర్ర కాలువపై నిర్మించిన వంతెన ప్రజా వినియోగంలోకి రాకపోవడంతో ఎర్రకాలువకు ఇరువైపులా వున్న గ్రామాల ప్రజల చిరకాల కల కలగానే మిగిలిపోయింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన రూ.4 కోట్లతో నిర్మాణం చేపట్టిన ఈ మధ్యలోనే ఆగిపోవడంతో నిరుపయోగంగా మారింది.

2005 లో ఆధునికీకరణ

జిల్లాలో అతి పెద్ద మురుగు నీటి పారుదల కాలువుగా వున్న ఎర్ర కాలువ ఆధునికీకరణ పనుల్లో భాగంగా 2005 సంవత్సరంలో భాగంగా ఎర్ర కాలువ గట్లపై ఆక్రమణలు తొలగించి గట్లను పటిష్టం చేయడంతో పాటు పంట పొలాలను వరద ముంపు నుంచి కాపాడేందుకు ఆనాడు ఎర్ర కాలువ గట్ల వెంబడి వున్న ఆక్రమణలు తొలగించి వెడల్పు చేశారు. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా వచ్చే మురుగునీరు సముద్రంలోకి చేర్చే మురుగు డ్రైన్లను స్థానికంగా వివిధ పేర్లతో పిలుస్తారు. నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం గ్రామాల్లో ఎర్రకాల్వగా పిలుస్తారు. తణుకు మండలంలోని దువ్వ, అత్తిలి మండల గ్రామాల్లో దువ్వ వయ్యేరుగా పిలుస్తారు. పెంటపాడు, ఉండి, పాలకోడేరు, భీమవరం మండలాల్లో దీనిని యనమదుర్రు డ్రైన్‌గా పిలుస్తారు. ఎర్ర కాలువ ప్రవహించే నిడదవోలు నుంచి భీమవరం వరకూ వున్న మురుగు డ్రైన్‌పై వివిధ మండలాల్లో ప్రపంచ బ్యాంకు నిధుల సహాయంతో 8 చోట్ల వంతెనల నిర్మాణం చేపట్టారు. తాడేపల్లిగూడెం మండలం ఆరుళ్ల గ్రామం, తణుకు మండలం కోనాల గ్రామ శివారులో ఒకటి, తణుకు మండలం దువ్వ గ్రామంలో, పెంటపాడు మండలం బీ.కొండేపాడు, మీన వల్లూరు, పాలకోడేరు మండలంలో ఒకటి, భీమవరం పట్టణంలో ఒకటి, భీమవరం మండలంలోని లోసరిలో ఒకటి చొప్పున వంతెనల నిర్మాణం చేపట్టారు. ఈ వంతెనలు వివిధ దశలలో ఆగిపోవడంతో కొన్నింటిని స్థానిక సంస్థల నిధులతో అప్రోచ్ రోడ్లు నిర్మించి ప్రజలకు అందుబాటులో వుంచారు.

మూడు నియోజకవర్గాల ప్రజలకు ప్రయోజనం

తణుకు మండలం కోనాల గ్రామ శివారు ఉండ్రాజవరం మండలం పసలపూడి గ్రామాల శివారులో నిర్మించిన వంతెన అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఈ వంతెన ద్వారా తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు నియోజకవర్గాలకు చెందిన గ్రామాల ప్రజలకు దగ్గరి మార్గం ఏర్పడనుంది. గతంలో ఈ వంతెన నిర్మించిన ప్రాంతంలో డోనె ద్వారా ఉండ్రాజవరం మండలంలోని పసలపూడి, కాల్దరి, సూర్యారావు పాలెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు తణుకు మండలంలోని కోనాల, ముద్దాపురం గ్రామాలు, తాడేపల్లిగూడెం మండలానికి చెందిన ఆరుళ్ల, మారంపల్లి, జగన్నాథపురం, మాధవరం, తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఈ డోనె సహాయంతోనే ఎర్ర కాలువ దాటి ప్రయాణాలు సాగించేవారు. అయితే 2005లో ఇక్కడ వంతెన నిర్మాణం చేపట్టడంతో ఇక్కడ డోనె తొలగించారు. ఈ వంతెన పూర్తయితే జిల్లాలకు చెందిన మూడు నియోజకవర్గాల ప్రజలకు దగ్గరి మార్గం ఏర్పడుతుందని ఆశించారు. ఈ వంతెన నిర్మాణం మొత్తం నాలుగు స్పాన్‌లుగా నిర్మాణం చేపట్టారు. దీనితో ఒక స్పాన్‌లో లోపాలున్నట్లు గుర్తించినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. అయితే ఈవంతెనకు ఇరువైపులా గ్రామాలకు సంబంధించి అప్రోచ్ రోడ్ల నిర్మాణం చేపట్టవలసి వుంది. అసంపూర్తిగా నిలిచిపోయి దశాబ్దాలు గడుస్తున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. 2015లో అప్పటి దేవదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సంబంధిత అధికారుల నుంచి వివరాలు తీసుకున్నా వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించలేకపోయారని అనంతరం వచ్చిన ఎమ్మెల్యే, మంత్రులు దీనిపై దృష్టి సారించకపోవడంతో ఇది పూర్తిగా మరుగున పడిపోయిందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

ఈ విషయంపై తణుకు, తాడేపల్లిగూడెం ఇరిగేషన్, డ్రైనేజీ శాఖలకు చెందిన ఇంజనీరింగ్ అధికా రులను వివరణ కోరగా వారు ఈ వంతెన నిర్మాణం 20 ఏళ్ల క్రితం జరిగింది. దీనికి సంబంధించిన వివ రాలు మాకు తెలియవు అని ఒకరు, ఎర్రకాలువపై వంతెన మా పరిధి కాదని మరి కొందరు సమాధానం చెబుతున్నారు.

• ప్రజాధనం సద్వినియోగం చేయండి



తణుకు, తాడేపల్లిగూడెం మండలాల గ్రామాల మధ్యలో ఎర్ర కాలువపై కోట్ల రూపాయల ప్రజాధనంతో రెండు దశాబ్దాల క్రితం చేపట్టిన వంతెన ప్రజలకు అందుబాటులో వుండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.ఈ వంతెన ద్వారా తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు నియోజకవర్గాల గ్రామాల మధ్య దూరం తగ్గి ప్రజలకు దగ్గరి మార్గంగా వుంటుంది. వంతెనకు మిగిలిపోయిన పనులతో పాటు ఇరువైపులా అప్రోచ్ రోడ్డులను త్వరగా ఏర్పాటు చేయాలి.

-బూరుగుపల్లి ఆనంద రమేష్, మాజీ సర్పంచ్, కోనాల

• నిర్మాణ పనులు ప్రారంభించాలి



తణుకు మండలం కోనాల శివారు, ఉండ్రాజవరం మండలం పసలపూడి గ్రామాల మధ్య ఎర్రకాల్వ వంతెన నిర్మాణంలో వున్న లోపాలను సరిచేసి ప్రయాణాలకు అనుకూలంగా మార్చాలని 15 ఏళ్లుగా ఎమ్మెల్యేలను, మంత్రులను కోరు తున్నాం. దివంగత మంత్రి మాణిక్యాలరావు చొరవతో అధికారులు కొంత ప్రయత్నం చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. నిర్మాణ పనులు పారరంభించాలి.

-షేక్ షాజహాన్, పసలపూడి,మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు,ఉండ్రాజవరం

తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాలు



తెన్నేటి మాస్టారు, బాలచందర్‌లను సత్కరిస్తున్న దృశ్యం

పాలకోడేరు/ పెనుగొండ జనవరి 21 (ఆంధ్ర జ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా సాహితీవేత్త, పాలకోడేరు తెలుగు మాస్టారు తెన్నేటికి తెలుగు భాష, సాహిత్యాలలో చేస్తున్న కృషిని గుర్తించిన అంతర్జాతీయ సాహితీ సంస్థ శ్రీ కళావేదిక, తెలుగు అసో సియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయిట్రీ అకాడమీలు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందజేశాయి. మంగళవారం విజయవాడలో అవార్డు అందు కున్నారు. పెనుగొండకు చెందిన ప్రముఖ కవి, రచయిత, గాయకుడు, ఆస్కా చైర్మన్ డాక్టర్ బాలచందర్, వడలి గ్రామానికి చెందిన కవి, రచయిత, గాయకుడు సామాజిక కార్యకర్త సురేష్ నాయుడు కూడా అవార్డులు అందు కున్నారు.




కోలమూరులో శ్రీకృష్ణలీలలు పౌరాణిక నాటక ప్రదర్శనలో సన్నివేశాలు

ఆకట్టుకుంటున్న సురభి నాటకాలు

ఉండి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సురభి వారి శ్రీకృష్ణలీలలు పౌరాణిక నాటక ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఉండి మండలం కోలమూరు సంతాన గోపాలస్వామి ఆలయంలో ముక్కోటి, ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా శ్రీవినాయక నాట్యమండలి (సురభి) ఆధ్వర్యంలో శ్రీకృష్ణలీలలు పౌరాణిక నాటకం ప్రదర్శించారు. వెరైటీ సెట్టింగులు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కంసుడు వధ ప్రధాన ఇతి వృత్తంతో ఈ నాటకం ప్రదర్శించారు. కళాకారులను కరతాళ ధ్వనులతో ఉత్తేజపరిచారు. నాటకాలను తిలకించడానికి కోలమూరు, ఉప్పులూరు, పాములపర్రు, ఆరేడు, కలిగొట్ల, పాందువ్వ, యండగండి, ఉండి, భీమవరం, గణపవరం, నిడమర్రు, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు, వీరవాసరం, తోకలపూడి, పాలకొల్లు తదితర ప్రాంతాలు నుంచి కళాభిమానులు విచ్చేశారు. ఆలయకమిటీ చైర్మన్ నంబూరి బదిరీ నారాయణరాజు,ఈవో మంతెన రామరాజులతో పాటు రుద్రరాజు రవి కుమార్‌రాజు, పేరిచర్ల శ్రీనివాసరాజు, బలరామరాజు, అప్పలరాజు, కెవిరాజు, ముదునూరి సతీష్‌రాజు, నరసింహరాజు పర్యవేక్షించారు.

కోలమూరులో సందడి

సురభి నాటకాల ప్రదర్శనలతో కోలమూరు గ్రామం సందడిగా మారింది. నాటకాలు, లైటింగ్ చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రావడంతో సందడి వాతావరణం నెలకొంది. బుధవారం రాత్రి లవకుశ , గురువారం శ్రీనివాస కల్యాణం నాటకం ప్రదర్శించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.



ఏలూరు ఏఎస్‌ఆర్ స్టేడియంలో ఫుట్‌బాల్ ఆడుతున్న దృశ్యం



ఏలూరు రైల్వేస్టేషన్ రోడ్డులో..

మంచు ముసుగు

పొగమంచు కప్పేసింది.. ఉదయం పది దాటినా చలి మాత్రం తగ్గడం లేదు.. గజగజ వణికిస్తోంది.. మంగళవారం ఉదయం ఆరుగంటల సమయంలో ఏలూరులో దట్టంగా అలముకున్న మంచు దృశ్యాలు

కష్ట జీవులకు కేరాఫ్..

• 40 ఏళ్లుగా ఇక్కడే పని చేస్తున్నా..



40 సంవత్సరాల నుంచి ఇదే మార్కెట్‌లో పని చేసుకుంటున్నాను. ఈ పనినే నమ్ముకుని పొట్ట పోసుకుంటున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. ఇద్దరికి వివాహం అయ్యింది. ఈ మార్కెట్‌లో పనిచేస్తూనే మా పిల్లలిద్దరికి పెళ్లిళ్ల చేశాను. ఈ మార్కెట్ మాకు అమ్మ లాంటిది. ఎంతో మందికి నీడనిచ్చే చల్లని తల్లి మా బ్రహ్మానందరెడ్డి మార్కెట్.

- ఏపూరి శ్రీను, జట్టు కార్మికుడు

• ఓపిక ఉన్నంతవరకు ఇక్కడే..



మాది దర్శిపర్రు. నేను ఈ మార్కెట్‌లో పనిలోకి వచ్చి సుమారు 45 సంవత్సరాలు పైగా అవుతుంది. అప్పట్లో నాకు కూలి వారానికి రూ.15 వచ్చేవి. ఇప్పుడు రోజూ రూ.600 నుంచి 700 వరకూ సంపా దిస్తున్నాను. నాకు ముగ్గురు పిల్లలు. నాకు ఓపిక ఉన్నంతవరకూ ఇదే మార్కెట్‌లో పని చేస్తాను. మా అందరికి అన్నం పెట్టి చల్లగా చూసే ఈ మార్కెట్ పది కాలాల పాటు బాగుండాలని కోరుకుంటున్నాను.

- గంధం సత్యనారాయణ, జట్టు కార్మికుడు

ఉల్లిపాయలు లోడ్ చేస్తున్న కార్మికులు →



కష్టేఫలి అన్నారు పెద్దలు. కష్టపడితే ఫలితం తప్పకుండా ఉంటుందని దీని అర్థం. తాడేపల్లిగూడెం పట్టణ నడిబొడ్డున ఉన్న బ్రహ్మానందరెడ్డి మార్కెట్ కష్టపడేవారికి లోటు లేకుండా జీవనం కల్పిసోంది.. సుమారు 100 సంవత్సరాల చరిత్ర కల్గిన ఈ మార్కెట్ కష్టజీవుల పాలిట కల్పవల్లిగా ఉంటున్నది. వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ వారి కుటుంబాలకు జీవనోపాధిగా మారింది. వాణిజ్య కేంద్రంగా తాడేపల్లిగూడేనికి పేరు రావడానికి ఈ మార్కెట్ కీలకమని చెప్పవచ్చు.. ఆ రోజుల్లో దాతలు ఇచ్చిన స్థలంలో గ్రామపెద్ద బ్రహ్మానందరెడ్డి దీన్ని ప్రారంభించడంతో ఆయన పేరే పెట్టారు.

-పెంటపాడు (ఆంధ్రజ్యోతి)

వందేళ్లుగా ఆసరా ఇస్తున్న తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్

కష్టపడే వారికి కష్టపడినంత..

వందలాది కుటుంబాలకు జీవనోపాధి

వాణిజ్య కేంద్రంగా ఖ్యాతికి ఈ మార్కెట్టే కీలకం



బత్తాయి బంతలను సంచుల్లో లోడింగ్ చేస్తున్న కార్మికులు

రోజుకూలీ చేసుకునే కార్మికులకు, చిరు వ్యాపారులకు తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్ కేరాఫ్‌గా నిలుస్తున్నది.. ఈ మార్కెట్‌లో పండ్లు, ఉల్లిపాయలు, కూరగాయలు, అపరాలు ఇలా అనేక వ్యాపారాలు సాగుతుంటాయి. పండ్ల మార్కెట్‌లో పర్మినెంట్‌గా 100 మంది కార్మికులు, ఉల్లిపాయల మార్కెట్‌లో సుమారు 300 మంది కార్మికులు ఉంటారు. వీరు కాకుండా గుమస్తాలు, లైన్ తిరేగేవారు ఇలా వేలాది మంది ఈ మార్కెట్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. తెల్లవారుజామునే మార్కెట్‌కి వచ్చి సాయంత్రానికి ఇళ్లకు చేరుకుంటారు..

కోట్లలో వ్యాపారం

ఈ మార్కెట్‌లో ఒక్క ఆదివారమే కోట్లలో వ్యాపారం జరుగుతూంటుంది. పండ్లు , ఉల్లిపాయలకు తాడేపల్లిగూడెం బ్రహ్మానందరెడ్డి మార్కెట్ ప్రసిద్ధి.. షోలాపూర్, కర్నూలు, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి శనివారం సాయంత్రం ఉల్లిపాయల లారీలు వందల సంఖ్యలో ఈ మార్కెట్‌లోకి వస్తాయి. ఇక్కడ దిగుమతి అయిన అనంతరం సమీప ప్రాంతాలకు ఇక్కడి నుంచే ఎగుమతి అవుతాయి. పండ్లు కూడా అంతే. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడే దిగుమతి అవుతాయి. ఇక్కడ నుంచి హోల్‌సేల్ ధరలకు సమీప ప్రాంతాలకు వెళ్తాయి. దీంతో ఆదివారం మార్కెట్ జనసందోహంగా కనిపిస్తుంది. మున్సిపాలిటీకి కూడా ఈ మార్కెట్‌పై పన్నుల రూపంలో మంచి ఆదాయం వస్తుంది.

చిరు వ్యాపారులకు కన్నతల్లిగా..

ఈ మార్కెట్‌లో పనిచేసే వారికి మాత్రమే కాదు .పట్టణంలో అనేక మంది బండ్లపై పండ్ల తదితర వ్యాపారాలు చేసుకునే వారికి కూడా ఈ మార్కెటే కన్నతల్లిగా ఆదరిస్తుంది. ప్రతీ రోజు ఉదయం తమకు కావలిసిన పండ్లు ఈ మార్కెట్ నుంచి కొనుగోలు చేసి బయట బండ్లపై లేదా గ్రామాల్లో మోటర్‌సైకిళ్ల, సైకిళ్లపై వ్యాపారాలు చేసుకుంటూ అనేకమంది తమ కటుంబాలను పోషించు కుంటున్నారు.

ఒకప్పుడు ఉప్పుడు బియ్యం అమ్మకాల్లో టాప్

గతంలో ఈ మార్కెట్‌లో ఉప్పుడు బియ్యం వ్యాపారం జోరుగా సాగేది. మార్కెట్ చుట్టుపక్కల కూడా ఉప్పుడు బియ్యం ఆడే మిల్లులు అధిక సంఖ్యలో ఉండేవి. కేవలం ఉప్పుడు బియ్యం అమ్మ కాల లోనే ఆదివారం కోట్లలో వ్యాపారం సాగేది. అయితే కాలక్రమేణ ఉప్పుడు బియ్యం అమ్మకాలు తగ్గిపోయాయి. ఫలితంగా మిల్లులు కూడా చాలా మూతబడ్డాయి.

ఘనంగా దసరా, సంక్రాంతి వేడుకలు

ఈ మార్కెట్‌లో కేవలం కష్టపడం డబ్బులు సంపాదించడం మాత్రమే కాదు. పండుగలు కూడా వైభవంగా నిర్వహిస్తారు. దీనికి సంబంధించి ఖర్చయిన ప్రతీ రూపాయి కూడా వ్యాపారులు, కార్మికులే ఇస్తుంటారు. దసరా వేడుకలు 9 రోజులు ఈ మార్కెట్ విద్యుద్దీపాల అలంకరణలో మెరిసిపోతూ ఉంటుంది. సంక్రాంతి పండుగ కూడా ఘనంగా నిర్వహిస్తారు

• తరతరాలుగా ఇక్కడే వ్యాపారం



మా పూర్వీకుల నుంచి తరతరాలుగా ఈ మార్కెట్‌లోనే వ్యాపారాలు సాగిస్తున్నాం. ఈ మార్కెట్ సంబంధించి దాతలు 11.30 ఎకరాల స్థలాన్ని పట్టణ అభివృద్ధి కోసం కొంత, వ్యాపారాలు చేసుకునే వారికి కొంత స్థలం ఇచ్చారు. అప్పుడు ఈ మార్కెట్‌ని బ్రహ్మానందరెడ్డి అనే గ్రామ పెద్ద ప్రారం భించారు. దీంతో అప్పటి నుంచి కూడా ఇదే పేరుతో ఈ మార్కెట్ జరుగుతోంది. వేలాది మందికి ఉపాధిగా మారింది.

- గుండుమోగుల సాంబయ్య ,పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు

• ఈ మార్కెట్టే మాకు జీవనోపాధి



ఈ మార్కెట్‌లో పండ్లు, ఉల్లిపాయలు, కూరగాయలు, అపరాలు వంటి అనేక పనుల్లో వేలాది మంది పని చేస్తున్నాం. ఈ మార్కెటే మా అందరికి జీవనోపాధి.. చుట్టుపక్కల పది గ్రామాల నుంచి ఈ మార్కెట్‌లో పనిచేయడానికి వస్తుంటారు. పని ఎక్కువైతే బయట నుంచి కూడా కొంతమంది వచ్చి పనులు చేస్తుంటారు

- జవ్వాది శ్రీను, సీఐటీయూ పట్టణ ప్రెసిడెంట్

విశాఖ ఉక్కు కాపాడుకోవడం చారిత్రక ఘట్టం

రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి.. చిత్రంలో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్

ఏలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వ పటిమతో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడం చారిత్రక ఘట్టమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కేంద్రంతో అంటకాగిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చాలాసార్లు ఢిల్లీ పర్యటనలు చేసినా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని రక్షించుకోవాలన్న ధ్యాస లేకపోగా, గాలికొదిలేశారని ఆరోపించారు. కేంద్రం మెడలు వంచుతామని ప్రగల్భాలు పలికి, 28 మంది ఎంపీల బలమున్న కనీసం కేంద్రంపై ఒత్తిడి తేలేక, పోరాట పటిమ చూపకుండా అవినీతికే ప్రాధాన్యం ఇవ్వడం వలన స్థాయి దిగజార్చుకున్నారన్నారు. కేంద్రం వదిలించుకోవాలని చూసినా, దానికి తలొగ్గకుండా ఫ్యాక్టరీ కోసం మంత్రి లోకేశ్ సైతం తన వంతు ఉద్యమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను ఉపసంహరించుకుని రూ.11,440 కోట్లుతో ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ సాధన వెనుక చంద్రబాబు కృషి ఉందన్నారు. అమరావతి నిర్మాణంతో పాటు విశాఖపట్నంలో రూ.2.08లక్షల కోట్లు పెట్టుబడులతో చేపట్టే పలు పనులకు ఇటీవల చంద్రబాబు నాయకత్వంలో మోదీ శంకుస్థాపనలు చేయడం తెలుగు జాతి గర్వించదగ్గ విషయమని అన్నారు. నిజంగా ఈ విషయంలో అందరూ మోదీ, అమిత్‌షా, ఉక్కు కేంద్ర మంత్రికి ధన్యవాదాలు తెలపాలన్నారు. కార్మికుల పోరాటం వృథా కాలేదని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ షేక్ నూర్జహాన్, టీడీపీ నాయకులు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

శీతాకాలంలో కోళ్లకు మిక్స్‌డ్ వైరస్

డీడీ డాక్టర్ జవహర్ హుస్సేన్

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పెంటపాడు, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : శీతాకాలంలో దేశవాళీ కోళ్లలో మిక్స్‌డ్ వైరస్ వ్యాధులు సోకి మరణాలు సంభవిస్తాయని, వ్యాధి సోకిన కోళ్ల లక్షణాలు కనిపించకుండానే నిమిషాలలో మృత్యువాత పడుతున్నాయన్నారు. ఈ విషయాన్ని పశుసంవర్థకశాఖ భీమవరం ఉపసంచాలకు డాక్టర్ జవహర్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కోళ్లకు అంతుచిక్కని వైరస్ అనే కథనానికి స్పందించారు. ఈ వైరస్ మనుషుల సంచారం, గాలి, నీరు, కోళ్ల ద్వారా వ్యాపిస్తుందన్నారు. కోళ్లలో ఏదైనా కోడి బలహీనంగా కనపడితే వెంటనే గమనించి ఆ కోడిని మిగతా కోళ్లకు దూరంగా ఉంచాలన్నారు. వైరస్‌ను నివారించే అంటీవైరల్ ఇన్‌ఫెక్టెంట్ లేదా బయోబస్టార్ పౌడర్‌ను కోడి తాగే నీటిలో ఒక గ్రాము మందు లీటరు నీటిలో కలిపి తాగించాలి. అలాగే 5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి కోళ్ల పెంచే ప్రాంతంలో స్ప్రే చేయాలి. వైరస్‌తో చనిపోయిన కోడిని ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా సక్రమంగా ఖననం చేయాలి. లేదా కాల్చివేయాలి. వ్యాక్సిన్ సోకని కోళ్లకు ఆర్‌డీఎఫ్ 1, ఆర్‌డీకే మరియు పాల్‌పాక్స్ వ్యాక్సిన్లు షెడ్యూల్ ప్రకారం వేయించాలని సూచించారు.

కాలుష్య నియంత్రణ మనందరి బాధ్యత

సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో పొల్యూషన్ విపరీతంగా పెరిగిపోయిందని దీనిని అరికట్టాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో పర్యావరణ పరిరక్షణ చట్టంపై సంబంధిత అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కార్యదర్శి రత్న ప్రసాద్ మాట్లాడుతూ పొల్యూషన్ విపరీతంగా పెరగడం వల్ల మానవాళికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అధికారులు పొల్యూషన్ అరికట్టడంలో తీసుకున్న చర్యలకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారాలు అందించేలాగ వారిని భాగస్వామ్యం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న సంబంధిత చట్టాలపైన అధికారులకు అవగాహన కలిగించాలనే ఉద్దేశ్యంతో ఇటు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఘన వ్యర్థ పదార్థాలను సేకరించి విభజించి ఉపయుక్తమైన ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. అలాగే కర్మాగారాల నుంచి వెలువడే కాలుష్య వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని లేని పక్షంలో చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతికతను ఉపయోగించి పర్యావరణాన్ని రక్షించాలని సూచించారు. ఆసుపత్రి నుంచి వెలువడే వ్యర్థాలను సేకరించి శాస్త్రీయ పద్ధతిలో వాటిని నిర్మూలించాలని సూచించారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎప్పటికప్పుడు చెత్త సేకరించి నిర్మూలనకు ప్రతి అధికారి కృషి చేస్తున్నారని అలాగే ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు.

కళాశాలలో విద్యాధికారి విచారణ



ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సాల్మన్ రాజు

ముదినేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 4న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై మంగళవారం ఉమ్మడి కృష్ణా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పి.వి. సాల్మన్ రాజు విచారణ జరిపారు. ఇంటర్మీడియట్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆయన కళాశాలలో ప్రిన్సిపాల్ జాస్మిన్‌ను విచారించటంతోపాటు ఆ పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకుల నుంచి కూడ సమాచారం సేకరించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభంలో ఆలస్యం కావటం, ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఆలస్యంగా రావటం, ఆ సమయంలో నాయకుల ప్రశ్నలకు ఆమె సమాధానం అసంతృప్తి కలిగించటం లాంటి విషయాలపై ఇంటర్మీడియట్ విద్యాధికారి సాల్మన్ రాజు ప్రిన్సిపాల్‌తో పాటు లెక్చరర్లను విచారించారు. వారి నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఈ నెల 4న జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌పై పలు ఫిర్యాదులు చేశారు. కళాశాలలో గతంలో 200 మందికిపైగా ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రిన్సిపాల్ వైఖరి వల్ల 70కి పడిపోయిందని చెబుతూ ఆమెను వెంటనే బదిలీ చేయాలని తెలిపారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహణరావు ఫోన్‌లో విచారణాధికారితో కళాశాల పరిపాలన దెబ్బతిందని ఫిర్యాదు చేశారు.

పీక కోసిన కేసులో ఇద్దరి అరెస్టు

గణపవరం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం ముగ్గళ్ల వద్ద ఆదివారం రాత్రి బొడ్డి కృష్ణ అనే వ్యక్తిని పీకకోసిన సంఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై మణికుమార్ తెలిపారు. దువ్వ గ్రామానికి చెందిన బొడ్డి కృష్ణతో వివాహేతర సంబంధం కారణంగానే ఈ సంఘటనకు దారి తీసిందని ఎస్సై తెలిపారు. కృష్ణ పీకకోసిన అదే గ్రామానికి చెందిన గండికోట జానేష్, గండికోట ఏసులను మంగళవారం వరదరాజపురం గ్రామం వద్ద అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డేంజర్ బెల్స్



- యువతలోనూ మధుమేహం
- వ్యాయామం, నాణ్యమైన ఆహారం తీసుకోవాలి
- ఒత్తిడి లేని జీవితం గడపాలి
- వ్యాధిపై అవగాహనతోనే నియంత్రణ సాధ్యం

ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డయాబెటిక్ ఫుట్ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వేణు

భీమవరం టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నేడు యువత కూడా మధుమేహం వ్యాధి బారిన పడుతున్నారు. దీనికి కారణం సరైన వ్యాయామం లేకపోవటం, క్వాలిటీ ఆహారం తీసుకోకపోవటం, జన్యుపరమైన కారణాలు కనిపిస్తున్నాయి. సోమవారం భీమవరంలో నిర్వహించిన మధుమేహ శిబిరంలో దాదాపు 100 మందికి పైగా 30 ఏళ్ల వయస్సున్నవారు రావటం ఆందోళన కలిగించే విషయం. దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. మధుమేహంపై అవగాహన పెంచుకోవాలని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డయాబెటిక్ ఫుట్ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వేణు కవర్తపు తెలిపారు. పూర్వం 50ఏళ్ల దాటిన వారికి ఈ వ్యాధి కనిపించేది. ఇప్పుడు వయస్సుతో సంబంధంలేకుండా రావటం దురదృష్టకరమని అన్నారు. యుకే- ఇండియా ఫుట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూవీ కృష్ణంరాజు మెమోరియల్ ఉచిత మెగా సుగర్ వ్యాధి చికిత్స శిబిరంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను మంగళవారం 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. ఈ సందర్భంగా మధుమేహం, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి ఆయన మాటల్లోనే తెలుసుకుందాం...



• మధుమేహ నియంత్రణకు ఏ ఆహారం తీసుకోవాలి ?

ముఖ్యంగా కార్బొహైడ్రేడ్ ఉండే పదార్థాలు తక్కువగా తీసుకోవాలి. రైస్‌ఎక్కువగా తిన్నా, గోధుమలతో చేసినవాటిని ఎక్కువ తీసుకున్నా ఇబ్బందే. అన్నం తక్కువగాను, ఎక్కువగా ఆకుకూరలు తీసుకుంటే కొంత రాకుండా ఉంటుంది. ముఖ్యంగా మధుమేహం వ్యాధి జనరక్‌వల్ల, కాలుష్యం వల్ల వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

• మధుమేహం కేసులు పెరగటానికి కారణాలు?

ప్రతి ఒక్కరికి వ్యాయం తగ్గిపోయింది. శారీరక శ్రమ ఎంతో అవసరం. ఒత్తిడి ఎక్కువగా ఉన్నా ఇబ్బందే. అందువల్ల నడక, యోగా వంటివి చెయ్యాలి. దీని ద్వారా కొంత అరికట్టే అవకాశం ఉంది.

• మధుమేహం ఉన్నవారికి కాళ్లకే పుండ్లు ఎందుకు పడతాయి?

మన శరీరంలో కాళ్ల నరాలు చాలా పొడవు ఉంటాయి. మెదడు నుంచి వెన్ను పూస దగ్గర నుంచి కిందకు వస్తాయి. ఈ నరాలపై వత్తిడి పెరగటంతోపాటు మధుమేహం వల్ల తొందరగా దెబ్బతినే ప్రమాదం ఉంది. మోకాళ్ల వరకు ఇబ్బంది ఉండదు కానీ పాదాల వద్దకు రక్త ప్రసరణ తగ్గటం వల్ల నరాలు దెబ్బతింటాయి. స్పర్శ కోల్పోతారు. దెబ్బ తగిలినా బాధ ఉండదు. దీనితో ఇన్‌ఫెక్షన్ వచ్చి కాలుతీసే ప్రమాదం ఏర్పడుతుంది.

• కాళ్లు తొలగించకుండా ఎలా చెయ్యవచ్చు?

కాళ్లు తొలగించటం వల్ల రోగి జీవితకాలం తగ్గిపోతుంది. నడక తగ్గటం వల్ల ఇతర ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల పుండు వల్ల దెబ్బతిన్న కాళ్లకు ఆపరేషన్ చేసి వంకరను సరిచేసి తొలగించకుండా చెయ్యటం వల్ల రోగి జీవితకాలం పెరిగే అవకాశం ఉంది.

• కాలు తొలగించకుండా వైద్యం మన దేశంలో ఉందా?

ఇన్‌ఫెక్షన్ బారిన పడిన కాలు తొలగించకుండా వైద్యం చేసే పరిస్థితి మన దేశంలో ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. తాము ఇక్కడ వైద్యులకు శిక్షణ ఇస్తున్నాం. భీమవరంలో కొంత మంది వైద్యులకు అవగాహన కల్పించాం. చాలా దేశాల్లో ఇంకా అందుబాటులోకి రాలేదు. ఇందు కోసం ఇంటర్‌నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డయాబెటిక్ ఫుట్ సర్జన్స్ అసోసియేషన్ కృషి చేస్తోంది. తాము కాలు తొలగించకుండా ఫుట్ ఆపరేషన్ చేసి మందులతో నయం చేస్తున్నాం. రోగిని నడిపిస్తున్నాం.

• పుండ్లు పడినవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

కాళ్లకు తప్పని సరిగా చెప్పులు ధరించాలి. వీరి కోసం ప్రత్యేకంగా తయారుచేసినవాటిని వాడటం వల్ల ప్రయోజనం ఉంటుంది. పాదాలకు దెబ్బలు తగలకుండా చూసుకోవాలి. స్పర్శ లేనట్లుగా గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. మందులను సమయానికి వేసుకోవాలి. మిత ఆహారం తీసుకుంటే మంచిది.

• మందు బిళ్లలు, ఇన్సులిన్ లేకుండా చికిత్స ఉందా?

ప్రస్తుతం నోటిలో స్ప్రే చేసుకునే మందు ఒకటి అందుబాటులోకి వస్తోంది. మన దేశంలో పరీక్షల దశలో ఉంది. త్వరలో అందుబాటులోకి రావటం వల్ల కొంత ఉపయోగంగా ఉంటుంది.

పంచాయతీల్లో శాటిలైట్, మోడల్, బేసిక్, ఫౌండేషన్, హైస్కూళ్లు

- నేటి నుంచి రెండురోజులపాటు అన్ని పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ తనిఖీలు
- ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలను ఒప్పించండి
- సర్‌ప్లస్ టీచర్లకు సమీప మండలాల్లోనే సర్దుబాటు
- ఉమ్మడిజిల్లా ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలతో పాఠశాల విద్య డైరెక్టర్ సమావేశం



హాజరైన ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఇతర అధికారులు

ఏలూరు అర్బన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : పేదపిల్లల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీల్లో ఏర్పాటు చేయతలపెట్టిన మోడల్ ప్రైమరీ స్కూళ్ల సంఖ్యను ఖరారు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయకుమార్‌రాజు ఆదేశించారు. ప్రస్తుతం వున్న ఆరు పాఠశాలల విధానస్థానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏర్పాటు చేయనున్న ఐదు రకాల పాఠశాలలను ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లాలో ఏర్పాటు చేయడానికి కార్యాచరణపై మంగళవారం ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలతో స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఏకబికిన రాత్రి 7.30 గంటలవరకు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో డైరెక్టర్ విజయ కుమార్ రాజు ఓ మెంటార్‌లా వ్యవహరించి, నేరుగా ఎంఈవోలు, హెచ్‌ఎంల వద్దకే వెళ్ళి ఐదు రకాల బడులు, జీవో 117 రద్దు, ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వ విధానాలను తెలియజేసి, వాటిపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశానికి రెండుజిల్లాల కలెక్టర్లు వెట్రిసెల్వి, నాగరాణిలతోపాటు, ఆర్డీవోలు, డీఈవోలు, అసెంబ్లీ నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, డీఆర్డీయే పీడీ, నోడల్ ఆఫీసర్లు సర్వేశ్వరరావు, శ్రీనివాస్, కాకినాడ ఆర్జేడీ, డీవైఈవోలు, అసిస్టెంట్ డైరెక్టర్లు, సూపరింటెండెంట్లు, తదితరులు హాజరయ్యారు. డైరెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలవారీగా విద్యార్థుల సంఖ్యను ఖచ్చితంగా నిర్ధారించేందుకుగాను 'యుడైస్' డేటాను ఇప్పటికే నిలిపివేశామని, ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా ఎంఈవోలందరూ బుధ, గురువారాల్లో తమ పరిధిల్లోని ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ స్వయంగా తనిఖీచేసి, తరగతుల వారీగా భౌతికంగా విద్యార్థుల హాజరును తీసుకుని ఎన్‌రోల్‌మెంట్‌ను తేల్చాలని ఆదేశించారు. ఈ డేటాను తాను స్వయంగా పరిశీలించిన తర్వాతే తుది వివరాలను ఎంఈవోలకు అందజేస్తానని, ఆ తర్వాతే నియోజకవర్గాలవారీగా పంచాయతీల్లో ఏర్పాటయ్యే శాటిలైట్, మోడల్, బేసిక్, ఫౌండేషన్, హైస్కూళ్ల స్వరూపంపై సంబంధిత ఎమ్మెల్యేలకు తెలియజేయాలని సూచించారు. కొత్తవిధానంలో ప్రారంభించే పాఠశాలలకు ఇప్పటికిప్పుడే మౌలికవసతులు, నిధులను సమకూర్చలేమని, అందుబాటులోవున్న వాటినే సమర్థవంతంగా వినియోగించుకుంటామని వివరించారు.

టీచర్లకు మిగులు భయాందోళనలు వద్దు

కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఐదు రకాల పాఠశాలల వల్ల క్షేత్రస్థాయిలో పాఠశాలల సంఖ్య భారీగా కుదింపు జరుగుతుందని, దీనివల్ల పెద్ద సంఖ్యలో మిగులు(సర్‌ప్లస్) ఉపాధ్యాయులు ఇబ్బందులు పడతారనే వెల్లువెత్తుతోన్న భయాందోళనలపై స్పష్టతనిచ్చారు. జీవో 117 ఉత్తర్వులను రద్దు చేసినప్పటికీ, ప్రత్యామ్నాయంగా చేపడుతున్న చర్యల్లో భాగంగా సర్‌ప్లస్ టీచర్లందరినీ సమీప మండలాలలకే సర్దుబాటు చేస్తామని భరోసా ఇచ్చారు. నూతన పాఠశాలల విధానంపై ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయసంఘాలను ఒప్పించే బాధ్యత ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలదేనని స్పష్టం చేశారు. ప్రతిపాదిత పాఠశాలలపై ఏప్రిల్ నెలాఖరునాటికి కార్యాచరణ పూర్తికావాలని, ఆ వెంటనే టీచర్ల బదిలీలు చేపడతామన్నారు.

పిల్లలకు హైవేలు, చెరువుల అడ్డంకులు లేకుండా చూడాలి

పంచాయతీ పరిధిలో మోడల్ ప్రైమరీ స్కూలులో మిగతా పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను విలీనం చేసిన అనంతరం, వాటి స్థానాల్లో 1, 2 తరగతులతో వీలైనన్ని ఎక్కువ సంఖ్యలో ఫౌండేషన్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ సూచించారు. ప్రస్తుతం చదువుతున్న ప్రాథమిక పాఠశాల నుంచి మోడల్ ప్రైమరీ స్కూలుకు చేరుకునేందుకు విద్యార్థులకు హైవేలు, చెరువులు వంటి అడ్డంకులతో రవాణా సదుపాయం లేనిచోట మాత్రమే 1నుంచి 5వ తరగతి వరకు ఉండేలా బేసిక్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటు చేయాలన్నారు. నూతన విద్యా విధానంలో క్లస్టర్‌లతో ప్రభుత్వ పాఠశాలలన్నీ ప్రత్యేక పర్యవేక్షణ చేయడం వీలవుతుందన్నారు. స్థానికంగా ఎదురయ్యే సమస్యలను కలెక్టర్లదృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవాలన్నారు. నమూనాగా ఉమ్మడి జిల్లాలో కొత్త పాఠశాలల విధానంపై ఇరగవరం, పెదపాడు మండలాల ఎంఈవోలు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ద్వారా డైరెక్టర్‌కు వివరించారు.

క్రైమ్ కార్నర్

శ్మశాన వాటికలో చెట్ల తొలగింపు

అడ్డుకున్న మునిసిపల్ అధికారులు

రోడ్డుపై బైఠాయించిన దళితులు



తణుకు- ఇరగవరం రోడ్డులో రాస్తారోకో చేస్తున్న ఎస్సీలు

తణుకు రూరల్, జనవరి 21, (ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణంలోని ఎస్సీ శ్మశాన వాటికలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, వృక్షాల తొలగింపులో ఏర్పడిన వివాదం దళితులు, మునిసిపల్, పోలీసుల మధ్య వివాదంగా మారింది. పట్టణంలోని 11, 12, 13 వార్డులలో నివసించే ఎస్సీ యువకులు జైభీమ్ యూత్ కమిటీగా ఏర్పడి తమ ప్రాంత శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని సంకల్పించారు. దానిలో భాగంగా కొద్ది రోజుల క్రితం మునిసిపల్ కమిషనర్‌ను కలిశారు. ఈనేపథ్యంలో ఈనెల 20వ తేదీ నుంచి జైభీమ్ యూత్ సభ్యులు శ్మశానంలో పిచ్చి మొక్కలతో పాటు వృక్షాలు కూల్చి వేసి నరికిన చెట్లను ట్రాక్టర్‌లతో తొలగిస్తుండటంతో మునిసిపల్ అధికారులు జోక్యం చేసుకున్నారు. మంగళవారం మునిసిపల్ అధికారులు శ్మశాన వాటిక వద్దకు వెళ్లి పెద్ద వృక్షాలను వేలం వేసి తొలగించాలని, వచ్చిన ఆదాయాన్ని శ్మశాన వాటిక అభివృద్ధికి ఉపయోగించాలి కాబట్టి పెద్ద వృక్షాలను తొలగించవద్దని జైభీమ్ సభ్యులను కోరారు. దీనితో తాము మున్సిపల్ కమిషనర్‌ను కలసి చెప్పిన తర్వాతే తొలగింపు చేపట్టా మని ఇప్పుడు అడ్డుకోవడం ఏంటని ప్రశ్నిస్తూ తణుకు ఇరగవరం ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద టెంట్ వేసే క్రమంలో పోలీసులకు, ఎస్సీలకు వాగ్వాదం ఏర్పడింది. ఎస్సీలు ధర్నా, దీక్షలకు దిగారు. పోలీసులు, దళితుల మధ్య ఘర్షణ వాతావరం ఏర్పడింది. ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌ను వివరణ కోరగా శ్మశాన వాటికలో మొక్కలను తొలగించేందుకు జైభీమ్ యూత్ సభ్యులకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు

ఇద్దరు యువకుల మృతి

అత్తిలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బల్లిపాడు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందినట్లు అత్తిలి పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన తోట అజయ్‌సాయి (23) మోటారు సైకిల్‌పై వేగంగా వెళుతూ ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాల పాలైన అజయ్‌సాయిను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అత్తిలి ఎస్‌ఐ పి ప్రేమరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొగల్తూరు: పాలకొల్లుకు చెందిన సేగు కోదండ కృష్ణ నాగ సునీల్ (24) సోమవారం తన అత్తవారి ఇంటికి కాళీపట్నం వెళ్ళేందుకు పాలకొల్లు నుంచి బైక్‌పై వెళుతున్నాడు. ఈ క్రమంలో మోటార్‌బైక్ కొత్తోట జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తాపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తుండగామంగళవారం మృతి చెందాడు. ఈఘటనపై మృతుని తండ్రి వీర వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నాగలక్ష్మి తెలిపారు.

ఇద్దరు డ్రైవర్లకు జైలు, జరిమానా

చింతలపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి మండలం తిమ్మిరెడ్డిపల్లి గ్రామంలో రెండు వాహనాలు ఢీకొన్న కేసులో ఇరువురికి ఏడాది జైలు, రూ.6వేలు చొప్పున జరిమానా విధిస్తూ చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు మంగళవారం నాడు తీర్పు చెప్పారు. 2018లో గణిజెర్ల గ్రామానికి చెందిన పింగుల వెంకటేశ్వరరావు వ్యాన్‌తోను, పెదవేగి మండలం రామసింగవరం గ్రామానికి చెందిన సూరిసెట్టి సుబ్బారావు ట్రాక్టర్‌తో తిమ్మిరెడ్డిపల్లి గ్రామంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో వెంకటేశ్వరరావు వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఓ మహిళ మృతి చెందగా మరో పది మంది మహిళలకు గాయాలయ్యాయి. నిందితలపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష పడింది.

బాలికను వేధిస్తున్న బాలుడిపై పోక్సో కేసు నమోదు

పెదవేగి, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో చదువుతున్న బాలికను అదే పాఠశాలలో చదువుతున్న బాలుడు ప్రేమించాలంటూ వేధిస్తున్న సంఘటనలో బాలుడిపై పోక్సో కేసు నమోదు చేశామని పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. మండలంలోని ఓ గ్రామంలోని పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలికను అదే పాఠశాలలో చదువుతున్న బాలుడు ప్రేమించాలంటూ కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఈ విషయమై బాలిక ఫిర్యాదు మేరకు పెద్దలు బాలుడిని మందలించినప్పటికీ ఆ బాలుడిలో మార్పురాకపోగా వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. దీంతోపాటు ఆ బాలుడు అల్లరి, చిల్లరిగా తిరుగుతూ పాఠశాలలో కూడా ఆకతాయి పనులకు పాల్పడుతుండడంతో నెలరోజుల కిందట టీసీ ఇచ్చి పంపించేశారు. సోమవారం సాయంత్రం పాఠశాలకు వెళ్ళిన ఆ బాలుడు.. ప్రేమించాలంటూ బాలికపై దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ బాలుడిపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

దొంగ అరెస్టు



ఏలూరు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సెలవులకు తాళాలు వేసి ఊరు వెళ్ళి వచ్చేటప్పటికి దొంగ ఆ ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని అరెస్టు చేశారు. ఏలూరు పావులదిబ్బ ప్రాంతానికి చెందిన మింగి దుర్గా ప్రసాద్ ఈనెల 15వ తేదీన ఏలూరు టూటౌన్ ప్రాంతంలో ఒక ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని లక్ష రూపాయల నగదు అపహరించాడు. ఈ సంఘటనపై బాధితుడు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీసీ వైవీ రమణ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేరానికి పాల్పడిన నిందితుడు మింగి దుర్గా ప్రసాద్‌ను మంగళవారం రాత్రి అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ అతనికి 14 రోజులు రిమాండ్ విధించారు.

సమస్య పరిష్కరించలేదని ఆత్మహత్యకు బెదిరింపు

ఏలూరు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణపురం గ్రామానికి చెందిన కొర్రపాటి లక్ష్మణరావు (27) ఈనెల 20వ తేదీన ఏలూరు కలెక్టరేట్‌కు వచ్చాడు. అక్కడ అధికారుల వద్దకు తన గ్రామంలో ఒక వ్యక్తి తనను వేధిస్తున్నాడని రెండేళ్ళ నుంచి తనపై దాడికి పాల్పడ్డాడని ఈ ఘటనపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన అధికారులు ఇప్పటి వరకూ పరిష్కరించలేదని పేర్కొన్నాడు. ఈ వేధింపులు భరించలేనని అప్పటికప్పుడు తనతో తెచ్చుకున్న పెట్రోల్‌ను తనపై పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో కలెక్టర్ అధికారులు జోక్యం చేసుకోవాలని ఆదేశించారు. అయినప్పటికి అతను అధికారుల మాట వినకుండా పెట్రోల్‌తో బెదిరింపులు చేపట్టడంతో చివరకు ఏలూరు త్రి టౌన్ పోలీసులు ఈ సంఘటనపై సోమవారం అర్ధరాత్రి తరువాత కేసు నమోదు చేశారు.

గేదెల అక్రమ రవాణాపై కేసు

తణుకు రూరల్, జనవరి 21, (ఆంధ్రజ్యోతి) ఈనెల 20వ తేదీన రెండు వ్యాన్‌లలో 10 గేదెలను తరలిస్తున్నట్లు గో సేవా సమితి సభ్యుల ఫిర్యాదు మేరకు గేదెలను హింసిస్తూ తరలిస్తున్న ఇద్దరు వ్యాన్ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తణుకు రూరల్ సీఐ కృష్ణ కుమార్ తెలిపారు. వ్యాన్‌లలో తరలిస్తున్న గేదెల ఆరోగ్య పరిస్థితిపై పశువైద్యుల పరీక్షల అనంతరం చర్యలపై ఎస్‌ఐ చంద్రశేఖర్ కోర్టుకు నివేదిక అందజేస్తారని తెలిపారు.

నష్టపోతున్న కొబ్బరి రైతులను ఆదుకోండి : రైతు సంఘం

ఏలూరు కార్పొరేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : నష్టాలపాలవుతూ కష్టాలు పడుతున్న కొబ్బరి రైతులను అన్ని విధాలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అన్నే భవనంలో కొబ్బరి రైతుల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి రైతుకు కనీస మద్దతు ధర అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వామి నాథన్ కమిషన్ సిఫా ర్సులకు అనుగుణంగా కొబ్బరికి కనీస మద్దతు ధర పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు బొల్లు రామకృష్ణ, గుదిబండి రమేష్ రెడ్డి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాస్

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

దెందులూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ర్యాగింగ్ జోలికి వెళ్లకుండా ఉన్నత లక్ష్య సాధన కోసం కష్టపడి చదవాలని అభయ పోలీసుల బృందం పేర్కొంది.మంగళవారం దెందులూరు మండలం వేగవరంలోని హేలాపూరి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ లావణ్య, ఏవో కరుణానిధి ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కళాశాలలో తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే అభయ టీం రక్షణగా నిలుస్తుందని తెలిపారు. ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లు ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతాలను హ్యాక్ చేసే అవకాశం ఉందని, అలాంటి సమయంలో వెంటనే చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తడికలపూడిలో ఫైరింగ్ ప్రాక్టీస్

కామవరపుకోట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తడికలపూడి పోలీస్ స్టేషన్ సమీపంలో గల ప్రాంగణంలో మంగళవారం 2025 వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివకిశోర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిలు నిర్వహించారు. ఆయుధాల నైపుణ్యాలను పరీక్షించిన ఎస్పీ పోలీసులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏకాగ్రతతో ఫైరింగ్ క్లాసులను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ మెళకువలు తెలుసుకుని నేర్చుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు చాలా కీలకమన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజల మాన, ధన, ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్.సూర్యచంద్రరావు, ఎఆర్ అదనపు ఎస్పీ ఎన్.ఎస్.ఎస్.శేఖర్, డీఎస్పీలు డి.శ్రావణకుమార్, యుగంధర్, ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రాక్టీస్ నిర్వహిస్తున్న ఎస్పీ శివ కిశోర్

సాదాసీదాగా ఏలూరు మండల సర్వసభ్య సమావేశం

ఏలూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన మంగళవారం ఏలూరు మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ శ్రీనివాస రాజు మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అనంతరం అధికారులకు ఎంపీడీవో వెన్నా శ్రీలత పలు సూచనలు, సలహాలు అందజేశారు. కొన్ని శాఖల అధికారులు గైర్హాజరవడంతో ఎంపీపీతో పాటు ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. వివిధ శాఖల అధికారులు, రూరల్ తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ఉంగుటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఏలూరు కాల్వగట్టుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను గ్రామాల వారీగా కమిటీలు వేసి తొలగిస్తామని జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి పూర్ణ చంద్రశేఖరరావు పేర్కొన్నారు. మంగళవారం జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో 23వ తేదీ నుంచి ఆయా గ్రామాల వారీగా భారీ బందోబస్తు మధ్య వివిధ శాఖల సమన్వయంతో ఆక్రమణలు తొలగిస్తామన్నారు.నారాయణపురం, చేబ్రోలు గ్రామాల్లో కోర్టు కేసులున్న ఇళ్లను మినహాయించి మిగతావాటిని తొలగించేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. సమావేశంలో సర్పంచి దిడ్ల అలకనంద, ఎంపీడీవో రాజ్ మనోజ్, ఈ.వో.పి.ఆర్.డి. చంద్రశేఖరన్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

చెరువు లీజు సొమ్ము ఇవ్వాలంటూ కొనసాగుతున్న నిరసన

పెదవేగి, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేసిన మోసంతో ఈ రోజు తాము ఖాళీ కంచాలు, ఆకలి కడుపుతో పస్తులుండే పరిస్థితి దాపురించిందని కొల్లేరు లంక గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చేపల చెరువుల లీజు సొమ్ము ఇవ్వలేదంటూ నెల రోజులుగా పెదవేగి మండలం కొండలరావు పాలెంలోని కొఠారు అబ్బయ్య చౌదరి ఇంటి దగ్గర కోమ టిలంక, శ్రీపర్రు గ్రామస్తులు నెలరోజులుగా చేస్తున్న నిరసన మంగళవారం కొనసాగింది. బాధితులకు మద్దతుగా మంగళవారం యాగనమిల్లి గ్రామస్తులు పాల్గొని ఖాళీ కంచాలను మోగిస్తూ నిరసన తెలిపారు. అబ్బయ్యచౌదరి ఓటమి అనంతరం సొమ్ము ఇవ్వకుండా విదేశాలకు పారిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికైనా స్వదేశానికి తిరిగి రాకతప్పదని, అప్పటి వరకు తమ ఆందోళన నిరంతరాయంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, భలే రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యత

ఏలూరుసిటీ, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతా కార్యక్రమం మంగళవారం స్థానిక అశోక్‌నగర్ ఏరియాలోని శ్రీ గౌరీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌బిఐ జీఎం ఆర్‌కె మహాన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి ఆర్ విజయరాజు, ఎస్‌బిఐ రీజినల్ మేనేజర్ ఎన్.ప్రసాద్, జిఎం డిఐసి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు , యూనియన్ బ్యాంక్ డిప్యూటీ ఆర్‌హెచ్‌ఎస్ సంతోష్ , నాబార్డ్ డిడిఎం టి.అనిల్ కాంత్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'అపుస్మా' ఏలూరు జోన్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్

ఏలూరు అర్బన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) ఏలూరు జోన్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌ను స్థానిక ఏఎస్ఆర్ స్టేడియంలో బుధ, గురువారాల్లో నిర్వహిస్తున్నట్టు సంఘ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.చంద్రశేఖరరావు, ఎన్.ఆర్.కే.ఏ.ప్రసాద్, కోశాధికారి వినోద్ కుమార్ తెలిపారు.

'రహదారి భద్రత ముఖ్యం'

ఏలూరు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి భవిష్యత్తు ఉన్నతికి చదువు ఎంత అవసరమో, రహదారి భద్రతా నియమాలపై అవగాహన అంతే అవసరమని అసిస్టెంట్ మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ అజ్మీరాబద్దు అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు, సిబ్బందికి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.

ద్వారకా తిరుమలలో...

ద్వారకా తిరుమల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను అరికట్టడం, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించడమే ఈ మాసోత్సవాల ప్రధాన లక్ష్యమని మహిళా కానిస్టేబుల్ పి.లక్ష్మీసుజన తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీనివాసా జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. రహదారిపై ప్రయాణించే సమయంలో పాటించే ట్రాఫిక్ నియమాలను వివరించారు.

చింతమనేని అర్జీల స్వీకరణ

పెదవేగి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ అసమర్థ పాలనతో రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా పతనావస్థకు చేరుకుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో మంగళవారం పలు గ్రామాల ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

క్యాన్సర్ బాధితులకు సాయం

ఏలూరుటూటౌన్, జనవరి21(ఆంధ్రజ్యోతి) : క్యాన్సర్ బాధితులను ఆదరించి ఆదుకోవాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. జైహనుమాన్ ఏజెన్సీస్ అధినేత ఎన్.సత్యప్రభాకర్ తన తల్లిపేరున వన్‌టౌన్‌లోని అగ్రహారంలో క్యాన్సర్ బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభాకర్ తల్లి సరస్వతి వర్ధంతి సందర్భంగా ప్రతీ ఏటా క్యాన్సర్ బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారని అన్నారు. ఈ ఏడాది 12 మంది క్యాన్సర్ బాధితులకు ఒక్కొక్కరికి 10 వేలు చొప్పున రూ.లక్షా 20 వేలు చెక్కులను ఎమ్మెల్యే చంటి ద్వారా అందించారు.

వరి సాగు పరిశీలన

భీమడోలు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : వరిసాగులో పురుగు మందులు, ఎరువుల వాడకాన్ని తగ్గించాలని ఏరువాక శాస్త్రవేత్త ఫణి కుమార్ సూచించారు. మండలంలోని భీమడోలు, పూళ్ల గ్రామాల్లోని వరిసాగును ఆయన సందర్శించారు. వరిసాగులో వేర్లు నల్లగా మారి వాసన వస్తే ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించారు.

రెడ్ క్రాస్ సమావేశం వాయిదా

ఏలూరు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా శాఖ కార్యాలయంలో ఈ నెల 29న జరగాల్సిన ఏలూరు జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. ఈ మేరకు జిల్లా ప్రెసిడెంట్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ ఒక ప్రకటనలో ద్వారా తెలియజేసింది. కమిటీ సభ్యులు గమనించాలని కోరారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

వర్తకులకు డీఎస్పీ శ్రావణ్ కుమార్ సూచన

ఏలూరు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : దుకాణ సముదాయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, లోనికి ప్రవేశించే సమయంలోనూ, బయటకు వెళ్ళే సమయాలలో సీసీ కెమెరాలలో డేటా నిక్షిప్తమయ్యేలా చూడాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ సూచించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ జి. సత్యనారాయణ, సిబ్బందితో ఏలూరు బులియన్ మర్చంట్ కల్యాణ మండపంలో వాణిజ్య వర్తక సంఘాలతో సిసి కెమెరాల ఉపయోగంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ బంగారు వర్తక సంఘాల వారు బంగారాన్ని కొనుగోలు చేసిన, తాకట్టు పెట్టిన వారి సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. బంగారాన్ని తక్కువకు తనఖా పెట్టిన అమ్మినటు వంటి సమయాలలో అది దొంగ బంగారం అయితే ఇబ్బందులకు గురవుతారన్నారు. దుకాణాలకు ఎదురుగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా వర్తక సంఘాల వారు మెయిన్ బజార్లో మూడు రోజులు ఒకవైపు వాహనాలు పార్కు చేసేలా మరో మూడు రోజులు వేరొక వైపు వాహనాలను పార్కు చేసేలా ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్‌కి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు భావించిన వెంటనే పోలీసులకుగాని, డయల్ 112కు గాని సమాచారాన్ని తెలియజేయాలన్నారు. సమాచారం అందుకున్న 10-15 నిముషాలలో సదరు వ్యక్తుల వివరాలుపై విచారణను చేస్తామన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ళ వలలో చిక్కుకుంటే వెంటనే 1930కి సమాచారం అందిస్తే బాధితులకు సహాయం అందిస్తామన్నారు.. ఎవరైనా సెల్ ఫోన్లను పోగొట్టుకుంటే సమాచారాన్ని వెంటే 9550351100కు మీ ఫోన్ ఆధారాలు, ఫోన్ నెంబర్, ఐఎంఈఐ నెంబర్‌ను తెలియజేస్తే దర్యాప్తు చేసి సెల్‌ఫోన్ దారులకు అందజేస్తామని తెలిపారు. నేర నియంత్రణకు పోలీసులు తీసుకున్న చర్యలకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ప్రజల సహకారంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం గౌరవాధ్యక్షులు పైడేటి రామారావు, అధ్యక్షులు తమ్మన మధుసూదన్‌రావు, సెక్రటరీ నంగులూరి సత్యనారాయణ, సెక్రటరీ కొనకళ్ళ దామోదర్, మద్దాల మురళి, జాయింట్ సెక్రటరీ వన్నెమరెడ్డి మహేష్, భాస్కర మణికంఠ, ట్రెజరర్ కొనిగొళ్ళ మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ

కృత్రిమ అవయవాల పంపిణీ

ఏలూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా అవసరమైన దివ్యాంగులకు మంగళవారం కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి విభిన్న ప్రతిభా వంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి రామ్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీచ్ థెరపీ తదితర సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

ఉచిత విద్యుత్ ఇవ్వండి

ఏలూరు రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రజక వృత్తి దారులకు చెరువుల వద్ద మోటారు బోర్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలన్న జీవోలను అమలు చేయాలని కోరుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఏలూరు విద్యుత్ భవనంలో ఆశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేద్కర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కట్లయ్య మాట్లాడుతూ దోబీ ఘాట్ విషయంలో రజకుల చెరువుల వద్ద విద్యుత్ శాఖ సీఎమ్డీ ఆదేశాల ప్రకారం మోటారు బోర్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరారు.

వైద్యానికి సాయం

ఉంగుటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పాకపాడు గ్రామానికి చెందిన కుకునూరి రాం ప్రసాద్‌కు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు రూ. 3లక్షల 50వేల ఎల్‌వోసిని అందించారు. కార్యక్రమంలో రాం ప్రసాద్ కుటుంబ సభ్యులు, ఎంపిటిసి ఇంటి మంగరాజు ఉన్నారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

ద్వారకాతిరుమల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల ఆర్థికాభివృద్ధికి తమ సంస్థ దోహదపడుతుందని పాల ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం (విజయ డెయిరీ)అధ్యక్షుడు పాకలపాటి మధు బ్రహ్మాజీ అన్నారు. మండలంలోని తిమ్మాపురంలో పాడి రైతులకు బోనస్, ప్రోత్సాహక బహుమతులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు కొయ్యలమూడి సరిత, మాజీ ఎంపిపి ఏపూరి దాలయ్య, పార్టీ నేతలు పోలిన శ్రీను, ఘంటా శ్రీనివాసరావు, విజయ డెయిరీ మేనేజర్ మూర్తి, రైతులు పాల్గొన్నారు.

కాకర్లమూడిలో ఫీవర్ సర్వే

ఉంగుటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు సిబ్బంది తెలుసుకుని వారి అవసరాలను గుర్తించాలని తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఆరోగ్య ఉప అధికారి వై.వీ.లక్ష్మణరావు సూచించారు. మంగళవారం నాడు మండలంలోని కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాకర్లమూడిలో ఫీవర్ సర్వే నిర్వహించారు.ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో ర్యాలీ నిర్వహించారు.

24 నుంచి ఆసుపత్రి కార్మికుల సమ్మె

జంగారెడ్డిగూడెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలోని పారిశుధ్య, సెక్యూరిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ జీతాలు విడుదల చేయాలని కోరుతూ ఏఐటీయుసి ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ఏపీ మెడికల్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు ఈ నెల 24 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు ఏఐటీయుసి మండల కార్యదర్శి కుంచె వసంతరావు, గౌరవాధ్యక్షుడు జంపన వెంకట రమణ రాజు తెలిపారు. మంగళవారం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమలకు సమ్మె నోటీసు అందచేసినట్లు తెలిపారు.

కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

ఏలూరు క్రైం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ చైర్మన్ పి.రాజ్‌కుమార్, కార్యదర్శి ప్రనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శంకరరావు పిలుపు మేరకు ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో రైల్వే ఉద్యోగులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పి.రాజ్‌కుమార్, కార్యదర్శి ప్రనోజ్ కుమార్‌లు మాట్లాడుతూ గ్యాంగ్ హట్స్ ఏర్పాటు చేయాలని, కీమెన్‌ల పని భారం తగ్గించాలన్నారు.

భోగోలులో దాహం కేకలు

లింగపాలెం, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని భోగోలులో మూడ్రోలుగా మంచి నీరు రాకపోవడంతో గ్రామస్తులు నిరసనకు దిగారు. గ్రామంలో తాగు నీరు రావడంలేదంటూ ఎన్నోసార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని వాపోయారు. తాగు నీటి సమస్య ఎప్పటి నుంచో ఉందని అప్పుడప్పుడూ కలుషిత నీరు కూడా వస్తోందని తాము ప్రజా ప్రతినిధులకు,అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తాగునీటి అవసరాలకు సంబంధించి మూడు మోటర్ల ద్వారా మంచినీరు అందిస్తుండగా అవి మరమ్మతులకు వచ్చాయని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ వాపోయారు. ఇదే విషయమై పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి కిరణ్‌ను వివరణ కోరగా గ్రామంలోని మూడు మోటర్లు ఉన్నాయని వాటికి మరమ్మతులు చేయాల్సి ఉందని వీలైనంత త్వరగా బాగు చేయించి తాగునీరు అందిస్తామన్నారు.


సమస్యలను వివరిస్తున్న గ్రామస్థులు

ఘనంగా అమ్మవారి జాతర

నిడమర్రు జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : బావాయిపాలెం గ్రామదేవత పుంతలో ముసలమ్మ అమ్మవారి 52 వ వార్షిక మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వార్షికోత్సవాలు ముగింపును పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన అఖండ అన్నసమారాధనలో సుమారు 5వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈకార్యక్రమం లో స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొని అన్న ప్రసాద వంపిణీ చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే ధర్మరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ ముత్యాల కాశీ, పద్మాకర్, ఆదిరెడ్డి చంద్రరావు పాల్గొన్నారు.


అమ్మవారి జాతరలో ఎమ్మెల్యే పత్సమట్ల .

ముంపు లేని భూములకు సాగు పట్టాలివ్వండి : సీపీఎం

జంగారెడ్డిగూడెం, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : ఎర్రకాలువ ప్రాజెక్టు ముంపు లేని భూముల్లో సాగు చేసుకుంటున్న పేదలకు సాగు పట్టాలివ్వాలని జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాలకు చెందిన దళిత, గిరిజనులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం, టి.నర సాపురం మండలాలకు చెందిన దళిత, గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సిపిఎం కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ ప్రాజెక్టు మిగులు భూముల్లో సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలివ్వాలని హైకోర్టు 2024 నవంబరులో తీర్పు ఇచ్చిందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆ తీర్పును అమలు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

ఏలూరు కార్పొరేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాండురంగ సెంటర్, కోటదిబ్బ వద్ద గల గణపతి త్రిదేవి పీఠం వద్ద గల ఆంజనేయస్వామి ఆలయాల వద్ద మంగళవారం భక్తులకు ఆలయ నిర్వాహకులు మహా అన్నప్రసాద వితరణను నిర్వహించారు. తొలుత ఈ ఆలయాల వద్ద భక్తులు స్వామివారికి తమలపాకులు, సింధూరంతో అర్చనలు జరిపి హనుమాన్‌చాలీసాను పఠించారు.

సీపీఐ ఆధ్వర్యంలో లెనిన్ వర్ధంతి

ఏలూరు కార్పొరేషన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీపీఐ కార్యాలయంలో లెనిన్ 101వ వర్ధంతిని సీపీఐ ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణచైతన్య, కురెళ్ళ వరప్రసాద్, బళ్ళ కనకదుర్గారావు, మావూరి విజయ, భజంత్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టోల్ గేట్ సిబ్బందికి ఉచిత వైద్యం

ఉంగుటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ నుంచి కూలీల వరకు ఇటీవల వెన్నెముక సమస్యతో బాధపడుతున్నారని డాక్టర్ తేజో ఫణీంద్ర అన్నారు. మంగళవారం ఉంగుటూరు టోల్ గేట్ వద్ద సిబ్బందికి రోడ్డు భద్రతా వారోత్సవ మాసోత్సవంలో భాగంగా రాజమహేంద్రవరం వేద స్పైయిన్ ఆసుపత్రి వైద్యులు పాంద్రాకులు తేజో ఫణీంద్ర ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టోల్ ప్లాజా మేనేజర్ ఇంతియాజ్,సురేష్ ల ఆధ్వర్యంలో సిబ్బందికి ఎముకలకు సంబంధించి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 450 మందికి వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు.

అదనపు తరగతి గదులకు స్థలం పరిశీలన

ఉంగుటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదనపు తరగతుల నిర్మాణం కోసం మంగళవారం ప్రిన్సిపాల్ టి.కే.విశ్వేశ్వర రావుతో కలిసి కళాశాల అభివృద్ధి కమిటీ స్థలాన్ని పరిశీలించింది. ఇందులో భాగంగా పి.ఎం. ఉష పథకం ద్వారా మంజూరైన రూ.3 కోట్ల రూపాయల నిధులపై సమీక్షించారు. భవన నిర్మాణానికి ఎలాంటి ఆటంకం లేకుండా పనులు జరిగేలా ప్రయత్నించాలని కోరారు. ఆయన వెంట సర్పంచి దిడ్ల అలకనంద, అభివృద్ధి కమిటీ చైర్మెన్ ఈపూరి సత్యనారాయణ, సాగిరాజు జానకిరామ రాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ఉచిత టీకాలు

పెదపాడు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్యశిబిరాలను వినియోగించుకుని పశువులను వ్యాధుల బారినపడకుండా చూసుకోవాలని పశు సంవర్థశాఖ సంయుక్త సంచాలకులు డాక్టరు టి. గోవిందరాజు తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాన్ని గోవిందరాజు మంగళవారం పరిశీలించి, పశువులకు అందజేస్తున్న వ్యాక్సిన్లు, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గొర్రెలు, మేకలకు ఉచితంగా టీకాలు, నట్టల నివారణ మందులు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా పాడిరైతులకు సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొమ్మన లక్ష్మణమోహన్ పాల్గొన్నారు.

పెన్షన్ దారులకు వైద్య పరీక్షలు

పోలవరం, జనవవరి 21(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలంలో పలు పంచాయతీల్లో మంగళవారం వైద్య బృందం పెన్షన్‌దారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పోలవరం మండలంలో పక్షవాతం బారిన పడిన 23 మంది బాధితులు ఉన్నారని, ఇటీవల నిజమైన అర్హులను గుర్తించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెన్షన్ పొందుతున్న వారిని క్షేత్ర స్థాయిలో పరిశీలించాలనే సూచనలతో పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ గాంధీ తెలిపారు. ఇంకా కొత్తపట్టిసీమ, పాత పట్టిసీమ, పోల వరం, ప్రగడపల్లి పంచాయతీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మొరాయించిన బ్యాంకు సర్వర్లు

పోలవరం, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండల కేంద్రంలో స్టేట్ బ్యాంకులో సర్వర్లు మొరాయించడంతో బ్యాంకు సేవలు నిలిచి వినియోగదారులు మంగళవారం ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం వారపు సంత కావడంతో పోలవరం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో అభయారణ్యం ప్రాంతాల్లో ఉన్న మెత్తప్పకోట, ఉడతపల్లి, గెడ్డపల్లి గ్రామాల నుంచి పోలవరం వచ్చే గిరిజనులు, డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళలు తమ అవసరాల కోసం బ్యాంకుకు తరలి వచ్చారు. సర్వర్లు పనిచేయక లావాదేవీలు నిలిచిపోవడంతో మహిళలు, వినియోగదారులు ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ వేచి చూసి వెనుదిరిగి వెళ్ళారు. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్ రవికుమార్‌ని వివరణ కోరగా బ్యాంకు లావాదేవీలన్నీ బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ ద్వారా జరుగుతుందని సిగ్నల్ లేకపోవడంతో సమస్య తలెత్తిందన్నారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ఏలూరు రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించనున్న పశువైద్య శిబిరాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని, పశువైద్యశాఖ ఏ.డి గోవిందరాజు తెలిపారు. మంగళవారం ఏలూరు రూరల్ మండల మాదేపల్లి గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్య శిబిరాల్లో పశువులు, జీవాలకు నట్టల నివారణ మందు ఇవ్వడంతో పాటు టీకాలు వేయనున్నట్టు తెలిపారు. పశువుల పెంపకంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా పాలదిగుబడులను అధికంగా పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా మాదేపల్లి పశువైద్యశాఖ అధికారిణి టి.ఎమ్.ఎస్ హైమ నట్టల నివారణ మందులను పశువులకు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం

జి.విజయకుమారి
ఎం.పి.డి.ఒ, నిడమర్రు



- **గ్రామాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు ఎలా అమలు చేస్తున్నారు ?**

జ : మండలంలోని అన్ని గ్రామాలలో ప్రతి మూడో శనివారం ఆయా గ్రామ సర్పంచ్‌లు పంచాయితీ సిబ్బందితో కలసి స్వచ్ఛ ఆంధ్ర పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

- **5 సంవత్సరాలలోపు చిన్నారు ఆధార్ నమోదు సంగతేంటి ?**

జ : అంగన్వాడీ కేంద్రాలలో నమోదయ్యే ఐదు సంవత్సరాల బాలబాలికలు ఆధార్ నమోదులో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం ప్రతిగ్రామంలో ఒక్కో రోజు ప్రత్యేక ఆధార్ సెంటర్ ను నిర్వహిస్తున్నాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- **హౌస్ హోల్డ్ సర్వే మెసేజ్‌ల కోసం ఏం చేయాలి ?**

జ : గతంలో వివిధ ప్రాంతాల్లో నివసించేవారికి , ఉద్యోగుల కుటుంబ సభ్యుల పేరు హౌస్ హోల్డ్ సర్వేలో నమోదు కాలేదు. ఇప్పుడు ఈ మిస్సింగ్ సిటిజన్లు వివరాల నమోదు కోసం సర్వే నిర్వహిస్తున్నాం. స్థానికులు ఆయా గ్రామ సచివాలయ సిబ్బందిని సంప్రదించాలి.

- **బాల్య వివాహలు నివారణ కోసం ఏ చర్యలు తీసుకున్నారు ?**

ప్రత్యేకంగా ప్రతి 2 వ శనివార కిశోర బాలికల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

నిడమర్రు (ఆంధ్రజ్యోతి)

బకాయిలు చెల్లించండి

చింతలపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల ఐదు నెలల జీతాలు, 18 నెలల పీఎఫ్, ఈఎస్ఐ పెండింగ్ విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి టి.బాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద కార్మికులతో నిరసన వ్యక్తం చేస్తూ ఈనెల 12న వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి తమ సమస్యలు తెలియజేశామని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే 24 నుంచి కార్మికులు సమ్మెలోకి వెళ్తారని, జీతాలు లేకపోతే ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసనలో కార్మికులు టి.మరియమ్మ, వెంకట్రావు, సునీత, వాణి, రామకృష్ణ పాల్గొన్నారు.

సారా స్వాధీనం

చింతలపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో సుప్రియన్ పేటలో ఎక్సైజ్ అధికారులు సారా తయారీపై ఆకస్మిక దాడులు జరిపారు. కొమ్మగిరి మాధవి నుంచి 20లీటర్లు, సి.హెచ్. శ్రీనివాసరావు నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. పాత కేసులో ముగ్గురిని, ఐదుగురు బెల్లం వ్యాపారులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు.

ఉచిత వైద్య పరీక్షలు

జంగారెడ్డిగూడెం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఆర్‌బీ ఎస్‌కే, డిఈఐసి విభాగంలో మంగళవారం గ్రహణం మొర్రి బాధితుల కోసం శస్త్ర చికిత్స నిమిత్తం మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. గన్నవరం మండలం చిన అవుటపల్లిలోని డాక్టర్ సుధా - నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య పరీక్షలకు తొమ్మిది మంది గ్రహణం మొర్రి బాధితులు హాజరయ్యారు. వారికి ఛీఫ్ సర్జన్ జి.శ్రీకాంత్ వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు.

పంగిడిగూడెంలో పొలం పిలుస్తుంది

జంగారెడ్డిగూడెం, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పంట పొలాల్లో తెగుళ్ల నివారణకు సూచనలిచ్చే ఎన్‌పిఎస్ఎస్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకుని ఉపయోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.కె.హబీబ్ సూచించారు. మంగళవారం మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి ఎస్.కె.హబీబ్ రైతులకు పలు సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు కళ్యాణ్ అగ్ని అస్త్రం తయారీ, వాడుకం, ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.వి.ఎన్.పోసారావు, సర్పంచ్ కోట వెంకటేశ్వరరావు, టిడిపి గ్రామాధ్యక్షుడు లింగాల సత్యనారాయణ పాల్గొన్నారు.



పెదగొన్నూరు శివారు కర్షక దళితవాడలో దశాబ్దం క్రితం వదిలేసిన బావి



కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో బాగు పడిన బావి

ఆర్థిక సంఘం నిధులతో బావి పునరుద్ధరణ

ముదినేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలం క్రితం పాడు బడి వినియోగించే అవకాశం లేక వదిలేసిన ఓ మంచినీటి బావికి ఆర్థిక సంఘం నిధులతో నేటికి మోక్షం కలిగింది. గత ప్రభుత్వం పంచాయతీ నిధులను దారి మళ్లించటం వల్ల గ్రామాల్లో చిన్న చిన్న పనులను కూడా చేపట్టలేకపోవటం జరిగిందని చెప్పేందుకు ఇదొక ఉదాహరణ. ముదినేపల్లి మండలం పెదగొన్నూరు పంచాయతీ శివారు కర్షక దళితవాడ గ్రామంలో సుమారు 60 ఏళ్ళ క్రితం పంచాయతీ తవ్వించిన బావి ఆ గ్రామస్థులకు దశాబ్దాల తరబడి తాగునీటిని అందించింది. సుమారు పదేళ్ల క్రితం ఆ బావి పాడైంది. గ్రామంలో తాగునీటి సౌకర్యం కొరవడింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేయడంతో ఇన్నాళ్లకు ఆ బావిని పునరుద్ధరించారు. సుమారు లక్ష వ్యయంతో బావిని అభివృద్ధి చేసినట్లు సర్పంచ్ తాడంకి శిరీష, కార్యదర్శి గిరిజ తెలిపారు.

'వైద్య శిబిరాలతో పశువులకు బహుళ ప్రయోజనాలు'

ముదినేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపదను పెంపొందించి వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ, ఇతర జాతుల పెంపకాన్ని అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని పశుసంవర్థక శాఖ మండవల్లి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. ముదినేపల్లి, అల్లూరు గ్రామాల్లో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఉచిత పశువైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ వర ప్రసాద్ మాట్లాడుతూ పశువైద్య శిబిరాల వల్ల పశువులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయన్నారు. పశువులకు సీజనల్‌గా సోకే వ్యాధులను గుర్తించి నిరోధక చర్యలు తీసుకోవచ్చునని, పాడి పశువుల్లో వ్యాధులను నివారిస్తే పాల దిగుబడి తగ్గకుండా చూడవచ్చునని అన్నారు.



వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

వివేకానంద విగ్రహావిష్కరణ

కైకలూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి) కైకలూరు పోలీసుస్టేషన్ల సముదాయంలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. కైకలూరు పోలీసుస్టేషన్ల భవనం వెనుకవైపు ఉన్న విగ్రహం వద్ద ఉన్న చెట్టు కూలిపోవడంతో ఆ దిమ్మను తొలగించే సమయంలో విగ్రహాన్ని తీసివేశారు. ఆ విగ్రహాన్ని మరలా ఏర్పాటు చేయగా డీఎస్పీ ఆవిష్కరించారు. సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్, ఎస్సైలు డి.వెంకట్ కుమార్, ఆర్.శ్రీను, నాగేశ్వరరావు, రామచంద్రరావు, వీరభద్రరావు పాల్గొన్నారు.

25న కొల్లేరు ప్రజల ఐక్యత బహిరంగ సభ

కైకలూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రజల ఐక్యత వర్థిల్లాలి అనే నినాదం తో ఈ నెల 25వ తేదీన కైకలూరులో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర టీడీపీ వడ్డీసాధికారిక కన్వీనర్ బలే ఏసురాజు తెలిపారు. కొల్లేరులో ప్రశాంతంగా జీవిస్తున్న ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా జీరో పాయింట్ల చేపల చెరువులు ధ్వంసం చేస్తున్నారని దీనిపైన చర్చించేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



నూతనంగా ఎన్నికైన సంఘ సభ్యులకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆగిరిపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి మండలం నూతన ఆర్యవైశ్యసంఘ అధ్యక్షుడిగా చలువాది వెంకటరత్నం, సెక్రటరీగా మడుపల్లి శ్రీరామ్మూర్తి, కోశాధికారిగా యండూరి శ్రీరామసుధీర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని యండూరి నారసింహ, మడుపల్లి గోపాల్, యండూరు ప్రణీత్, తవ్వా మురళీధర్, జూలూరి కోటేశ్వరరావు, టి.వి.ఎస్ కిరణ్ బలపరిచారు. వై.మిదున్, ఎం.రిత్విత్, వై.రమేష్, జె.మారుతి, శశిధర్ పాల్గొన్నారు.





రమణక్కపేటలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

రమణక్కపేటలో రహదారిపైనే మురుగు నీరు

ముసునూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేటలో పారుశుధ్యం అధ్వానంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉండటంతో రహదారులపైనే మురుగునీరు ప్రహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న డ్రైనేజీ పూర్తిగా పూడుకుపోవడంతో నివాస గృహాల్లో వాడుకనీరు రహదారిపైనే ప్రవహిస్తోంది. పాదచారులు, వాహన దారులు మురుగునీటిలో వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, పాలకులు చర్యకలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పేదలకు నూతన వస్త్రాల అందజేత

ఆగిరిపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండలం సగ్గూరు గ్రామంలో చర్చ్ ఆఫ్ క్రైస్ట్ చారిటబుల్ మినిస్ట్రీస్ డైరెక్టర్ గొర్రె బెన్నీరాజు ఆధ్వర్యంలో 70 మంది వితంతువులకు రగ్గులు, 50 మంది నిరుపేదలకు నూతన వస్త్రాలను మంగళవారం అందజేశారు. పాస్టర్లు కోటా భాస్కర్, ఆదాము, రంగారావు, రాజారత్నం, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు వస్త్రాలు అందిస్తున్న బెన్నీరాజు



బాధితులను పరామర్శిస్తున్న ముద్దరబోయిన

బాధితులకు టీడీపీ నాయకుల పరామర్శ

ఆగిరిపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నూగొండపల్లి గ్రామంలోని మల్లవల్లి కోటేశ్వరరావు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అనారోగ్యంతో బాధపడుతుండగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పరామర్శించారు. పిన్నమరెడ్డిపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కుంపటి కోటే శ్వరరావు భార్య సుజాత అనారోగ్యంతో మృతిచెందారు. వారిని, వారి కుటుంబాన్ని పరామర్శించారు.

పల్లెర్లమూడిలో పొలం పిలుస్తోంది


నూజివీడు టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి):నూజివీడు మండలం పల్లెర్లమూడి, ఎమ్ఎన్‌పాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని మొక్కజొన్న, రబీవరి పంటలను అధికారులు పరిశీలించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



పల్లెర్లమూడిలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నీరందక ఎండిపోతున్న మినుము పైరు

ముదినేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నీటి ఎద్దడితో ముదినేపల్లి ప్రాంతంలోని మినుము పైరు ఎండిపోతున్నది. క్యాంప్ బెల్, పోల్ రాజ్ కెనాల్స్ పరిధిలో వందలాది ఎకరాల్లోని మినుము పైరుకు గత 15 రోజులుగా నీరందక మొక్కలు వాడిపోతున్నాయి. భూముల్లో తడిలేక పూత దశలో ఉన్న మినుము పైరు ఎండిపోయి ఆకులు రాలిపోతున్నాయి. సారవంతమైన భూముల్లో కూడ పైరు రోజుల తరబడి సాగునీటి కొరత కారణంగా ఎండిపోయి పిలక దశకు చేరుకునే పరిస్థితి కనిపించటం లేదు. మినుము మొక్కలు కూడ బలహీనమైపోయి కాయలు కాస్తాయా లేదా అన్నది రైతులకు ఆందోళన కలిగిస్తున్నది. 40 రోజులుగా వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి కాపాడుకుంటూ వచ్చిన మినుము నీరు లేక పాడైపోయి పంట చేతికి దక్కుతుందా? లేదా అన్నది ప్రశ్నార్థకంగా తయారయింది. క్యాంప్ బెల్ కెనాల్ క్రింద సింగరాయపాలెం, విశ్వనాద్రిపాలెం, పెదగొన్నూరు, అల్లూరు, ఈడేపల్లి, బొమ్మినంపాడు, ములకలపల్లి తదితర గ్రామాలకు చెందిన సుమారు వేలాది ఎకరాల భూముల్లో మినుము వరి పైరు నీరు లేక దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది.



పెదగొన్నూరులో సాగునీటి కొరతతో ఎండిపోతున్న మినుము పైరు

■ **తీరని నష్టం : శ్యామ్, రైతు**



క్యాంప్ బెల్ కెనాల్‌కు నీరు విడుదల చేయకపోవడంతో మినుము పైరు ఎండిపోతోంది. పైరుకు నీరు అవసరమైన సమయంలో కాల్వలకు నీరు బంద్ చేయడం రైతులకు తీరని నష్టం కలిగిస్తోంది. వెంటనే కాల్వలకు నీరు విడుదల చేయాలి.

కళాశాలలో విద్యాధికారి విచారణ

ముదినేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 4న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై మంగళవారం ఉమ్మడి కృష్ణా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పి.వి.సాల్మన్ రాజు విచారణ జరిపారు. ఇంటర్మీడియట్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆయన కళాశాలలో ప్రిన్సిపాల్ జాస్మిన్‌ను విచారించడంతోపాటు ఆ పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకుల నుంచి సమాచారం సేకరించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభంలో ఆలస్యం కావడం, ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఆలస్యంగా రావడం, ఆ సమయంలో నాయకుల ప్రశ్నలకు ఆమె సమాధానం అసంతృప్తి కలిగించడం వంటి విషయాలపై ఇంటర్మీడియట్ విద్యాధికారి సాల్మన్ రాజు ప్రిన్సిపాల్‌తో పాటు లెక్చరర్లను విచారించి వారి నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ప్రిన్సిపాల్‌పై పలు ఫిర్యాదులు చేశారు. కళాశాలలో గతంలో 200 మందికిపైగా ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రిన్సిపాల్ వైఖరి వల్ల 70కి పడిపోయిందని చెబుతూ ఆమెను బదిలీ చేయాలని కోరారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు ఫోన్‌లో విచారణాధికారితో మాట్లాడి కళాశాల పరిపాలన దెబ్బతిందని ఫిర్యాదు చేశారు.



ప్రిన్సిపాల్‌ను విచారిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సాల్మన్ రాజు

ముళ్ల పొదల తొలగింపు

కలిదిండి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కొండంగి ఎత్తిపోతల పథకాల ఆవరణలో ఎత్తిపోతల కమిటీ ఛైర్మన్ వేగిరెడ్డి చిన్నారావు ఆధ్వర్యంలో దట్టంగా ఉన్న ముళ్ల పొదలను మంగళవారం తొలగించారు. మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లను ఏరివేశారు. ఆవరణంతా శుభ్రపరిచారు. కార్యక్రమంలో కలిదిండి, కోరుకొల్లు డీసీ ఛైర్మన్లు భోగేశ్వరరావు, సత్యనారాయణ, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



పెద్దింటి అమ్మవారికి బంగారు ఆభరణం బహూకరణ

కైకలూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కొల్లేటి కోట పెద్దింటి అమ్మవారి ఆలయానికి మంగళవారం పందిరిపల్లిగూడెం గ్రామానికి చెందిన జయమంగళ కొండలు, సీతారామ అంజమ్మ దంపతులు 33గ్రాముల బంగారపు హారాన్ని అందించారు. అమ్మవారిని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ అధికారి శ్రీనివాస్ శేషవస్త్రాలతో ఎమ్మెల్యేను సత్కరించారు.



అమ్మవారికి బంగారపు ఆభరణాన్ని అందజేస్తున్న జయమంగళ కొండలు దంపతులు

సుబ్రహ్మణ్య స్వామికి ప్రభుత్వ విప్ కుటుంబ సభ్యుల పూజలు

ముదినేపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సతీమణి అనూరాధతోపాటు కుటుంబసభ్యులు పుట్టలో పాలు పోసి పూజలు జరిపారు. దేవస్థానం ఏఈ గంగా శ్రీదేవి, అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

సుబ్రహ్మణ్య స్వామికి మడత కాజా స్వీట్లు

కైకలూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కైకలూరు చిన్నచెరువుగట్టుపై ఉన్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి 100 కేజీల మడత కాజాలను గ్రామానికి చెందిన చెక్కా వెంకట సుబ్బారావు అందజేశారు.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి



పిచ్చేశ్వరరావు(ఫైల్)

ముసునూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం శివారు పెద్దపాటివారి గూడెంకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ ఉండవల్లి పిచ్చేశ్వరరావు (66) సోమవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మంగళవారం మండల, గ్రామ టీడీపీ నాయకులు పిచ్చేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్న ఆయన పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఉప సర్పంచ్, కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్‌గా పనిచేశారు.

దిగవల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

నూజివీడు టౌన్, జనవరి 21(ఆంధ్రజ్యోతి) : నూజివీడు మండలం దిగవల్లిలో తిరువీధి లక్ష్మీరామారావు సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఎస్.ఎస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ట్రస్ట్ ఛైర్మన్ టి.కృష్ణ మాట్లాడుతూ క్యాంపుల్లో గుర్తించిన పేదలకు ఉచితంగా వైద్యసేవలను ట్రస్ట్ అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు ఎస్.కె నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట : మంత్రి పార్థసారథి

ముసునూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం గుడిపాడు, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి గ్రామాలకు చెందిన ముగ్గురు లబ్దిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ 1.46 లక్షల విలువగల చెక్కులను వారి ఇళ్లకు వెళ్లి మంత్రి అందజేశారు. మంత్రి దృష్టికి డ్వాక్రా మహిళలు పలు సమస్యలు తీసుకు వచ్చారు. తమ గ్రూపులలో గల రూ.2లక్షల నగదును బుక్‌కీపర్లు, తమకు తెలియకుండా సొంతానికి వడుకున్నారని మహిళలు మంత్రికి మొరపెట్టుకున్నారు. డీఆర్‌డీఏ పీడీకి ఫోన్‌చేసి శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకువాలని ఆదేశించారు.రహదారులను అభివృద్ధి చేయాలని మంత్రిని కొంతమంది కోరగా త్వరలోనే పనులు చేపటనున్నట్లు ఆయన చెప్పారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి పార్థసారథి

'పాడి రైతులు వైద్యుల సూచనలు పాటించాలి'

చాట్రాయి, జనవరి 21(ఆంధ్రజ్యోతి):పాడి రైతులు పశువైద్యుల సూచనలు పాటించి మంచి ఆదాయం పొందాలని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాస రావు అన్నారు. మండలంలోని చనుబండ పశువైద్యశాలలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్యశిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో 40 పశువులకు చికిత్సలు చేసి, 600 గొర్రెలు, 200 మేకలకు నట్టల నివారణ మందు, రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏఎస్‌ఏ పవనకుమారి, పరసా శ్రీనివాసరావు, నెక్కలపు వెంకటేశ్వర రావు, గోపాలమిత్ర విస్సంపల్లి వెంకటేశ్వరరావు, ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.



పశువుల దాణా పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు

వేంపాడు మేజర్ కాల్వ గండి పూడ్చివేత

ముసునూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): వేంపాడు మేజర్ నాగార్జున సాగర్ ఎడమ కాలువ అభివృద్ధిని గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలివేయడంతో కాలువకు అక్కడక్కడ గండులు పడటంతో పాటు జంగిల్ పెరిగిపోయి నీరు ముందుకు కదిలే పరిస్థితి లేదు. వేంపాడు మేజర్ ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ క్షేత్రస్థాయిలో కాలువను పరిశీలించగా దిగవల్లి వద్ద పెద్ద గండి, సూరేపల్లి వద్ద ఆరు చోట్ల గండ్లు ఉన్నట్లు గుర్తించారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్ళగా గండ్లు పూడ్చివేతకు ఏడాది క్రితమే ప్రతిపాదనలు పంపామని నిధులు మంజూరుకాలేదని చెప్పినట్లు బాలకృష్ణ తెలిపారు. ఛైర్మన్ బాలకృష్ణ మందస్తుగా రూ.4 లక్షలు సొంత నగదుతో దిగవల్లి వద్ద కాలువకు పడిన పెద్ద గండిని మంగళవారం ఆయన దగ్గర ఉండి పూడ్చివేయించారు. వేంపాడు జోన్‌ట్రీ కాలువకు నీరు విడుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఛైర్మన్ చెప్పారు.



గండిని పూడ్చే పనులను పరిశీలిస్తున్న ఛైర్మన్ బాలకృష్ణ

ఉచిత పశువైద్య శిబిరాలు

ముసునూరు/ నూజివీడు టౌన్ జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పశువులు, జీవాల్లో ఉన్న వ్యాధు లను తగ్గించి, రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకో వాలని పశువైద్యాధికారి డాక్టర్ ఎం.వెంకట చైత న్య అన్నారు. మంగళవారం వేల్పుచర్ల, సూరే పల్లిలో జరిగిన పశువైద్య శిబిరాల్లో పశువులకు సంబంధించి గర్భకోశ వ్యాధులకు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుతో పాటు బొబ్బ వ్యాధికి టీకాలను వైద్యులు వేశా రు. నూజివీడు మండలం జంగంగూడెంలో సర్పంచ్ పొట్లూరి అంజనికుమారి పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పాడిరైతులు పశు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు.

ఇంటర్వ్యూ..

రైతులు పశువుల పట్ల శ్రద్ధ తీసుకోవాలి

పశు సంవర్ధకశాఖ ఏడీఏ వరప్రసాద్



● **పశువులు జబ్బు పడకుండా రైతులు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?**

జవాబు: మంచినీటిని అందిస్తూ పశు గ్రాసాలతో పాటు 30 గ్రాములు ఖనిజ లవణాలు మిశ్రమాన్ని రోజూ దాణా లేదా కుడితిలో కలిపి అందించాలి. సకాలంలో మందులు, టీకాలు వేయించాలి.

● **ప్రస్తుతం పశువుల్లో వచ్చే వ్యాధులు నివారణకు చేపట్టాల్సిన చర్యలు ?**

జవాబు : గొంతువాపు, జబ్బవాపు, దొమ్మ మొదలైన అంటువ్యాదులు, జీర్ణాశయ జలగలు, కుందేవి వెర్రిలాంటి వ్యాధులు సోకుతాయి. ఈ వ్యాదుల నివారణకు శుభ్రత పాటించాలి. గాలికుంటు వ్యాధికి నివారణకు వ్యాక్సిన్లు ఉన్నాయి.

● **రైతులు షెడ్లు నిర్మించుకోవడానికి ఎలాంటి సహాయం అందుతుంది?**

జవాబు : చిన్న సన్నకారు రైతులు ఇంటి వద్ద షెడ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం మినీ గోకులాలు పథకాన్ని తీసుకొచ్చింది. రెండు పశువులకు రూ.1.15 లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85 లక్షలు, ఆరు పశువులకు రూ.2.30 లక్షలను 90 శాతం రాయితీతో అందిస్తుంది.

● **పశుగణన ఎంత వరకు వచ్చింది?**

జవాబు : నెల రోజులుగా గ్రామాల్లో పశువుల గణన చేస్తున్నాం. దాదాపు 50 శాతం సర్వే పూర్తి అయింది.

● **పశువులకు కల్పిస్తున్న బీమా ?**

జవాబు : ప్రభుత్వం ఎస్సీ ఎస్టీలకు 80 శాతం, మిగిలిన వాళ్లకు 50శాతం ప్రీమియాన్ని రాయితీతో బీమా సౌకర్యాన్ని కల్పిస్తుంది. సాధారణ పశువులకు రూ.15 వేలు మేలుజాతి పశువులకు రూ.30వేలు వరకు పరిహారాన్ని పొందే వీలుంటుంది.

● **ప్రస్తుతం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలు లక్ష్యం ?**

జవాబు : క్షేత్రస్థాయిలో పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం.

- మండవల్లి

కొనసాగిన పశువైద్య శిబిరాలు

కలిదిండి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆవకూరు, అమరావతి గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలను మంగళవారం నిర్వహించారు. 120 పశువులకు వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. 400 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. పశు వైద్యాధికారి ప్రహర్ష, సిబ్బంది పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిబంధం, తుమ్మగూడెం గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో ఇద్దరి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. ఈ మేరకు నిందితులు రమాదేవి, మహేష్‌లపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు చెప్పారు.ఎస్సైలు ఈశ్వరరావు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



పండ్ల తోటను పరిశీలిస్తున్న డీఆర్పీ

ప్రారంభమైన సామాజిక తనిఖీలు

ముసునూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో సామాజిక తనిఖీలు మంగళవారం ప్రారంభ మయ్యాయి. ఎస్ఆర్పీ నందిని పర్యవేక్షణలో నాలుగు బృందాలు తనిఖీలు చేపట్టాయి.తొలిరోజు చింతవల్లి, వేల్పుచర్ల, చెక్కపల్లి, రమణక్కపేట గ్రామాల్లో డీఆర్పీలు పనులను పరిశీలించారు. తనిఖీలో ఏపీవో రోజ్‌లీల, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తనిఖీ బృందాలకు జరిగిన పనులను వివరించారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

నూజివీడు టౌన్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణం బాపూనగర్‌లో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటనపై నూజివీడు పట్టణ పోలీసులు కేసునమోదు చేశారు. బాపూనగర్‌కు చెందిన షేక్ హసీనా (26) ఉరివేసుకుని మృతి చెందగా ఆమె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ హసీనాతల్లి రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై జ్యోతిబసు తెలిపారు.